ప్రజాశక్తి

మంగళవారం 18 మార్చి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

నగర పాలక సంస్థలో..

అవిశ్వాస వ్యూహాలు

- మేయర్ పీఠాన్ని కదిలించే దిశగా టిడిపి పావులు
- బలాన్ని కోల్పోయి ఆశలు వదులుకున్న వైసిపి
- ఒకటి, రెండు రోజుల్లో మారనున్న రాజకీయ పరిణామాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) మేయర్ పీఠం ఏ క్షణాన్నైనా కదలనుంది. ప్రస్తుతం ఆ పీఠం పైనున్న గొలగాని హరివెంకటకుమారి ఈ నెల 18 తరువాత దిగిపోక తప్పదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మేయర్ పదవి కోసం 'కూటమి' పార్టీల విశాఖ నేతలు పలువురు కళ్లు కాయలు కాసేలాగ ఎదురుచూస్తున్నారు. విశాఖ జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్, ఎంఎల్‌సిలు.. ఇలా అన్నీ గెలుచుకున్న వీరు ఒక్క జివిఎంసి మాత్రమే ఇప్పటివరకూ తమ గుప్పెట లేదని తెగ బాధపడిపోతున్నారు. దీన్ని కూడా తమ ఖాతాలో వేసుకుని నగర పాలక సంస్థలో తమ సత్తా చాటేందుకు పావులు కదుపుతున్నారు.

రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారం చేపట్టిన తర్వాత మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌లను తమ గుప్పెట్లో పెట్టుకుంటున్న సంగతి తెలిసిందే. నాలుగేళ్లలోపు అవిశ్వాసం పెట్టకూడదన్న నిబంధనతో విశాఖ నగర పాలక సంస్థ జోలికి ఇంతవరకూ అధికార పార్టీ రాలేదన్నది తెలిసిందే. ఒక పార్టీ తరపున నగర పాలక సంస్థలో పోటీకి దిగి గెలుపొందిన వారు మరో పార్టీలోకి ఫిరాయింపులు జరిపిన తర్వాత విశాఖలో టిడిపి బలం 60కి పైగా పాకింది. జివిఎంసి ఎన్నికలు జరిగిన సమయంలో వైసిపికి 65 మంది కార్పొరేటర్లు ఉండేవారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత రాజకీయ సీను మారడంతో టిడిపికి సంఖ్యా బలం గణనీయంగా పెరిగింది. అధికార పార్టీ నుంచి పలువురు కార్పొరేటర్లు టిడిపి, జనసేనల్లో చేరారు. ప్రస్తుతం జివిఎంసి పాలకవర్గంలో 98 మంది కార్పొరేటర్లు, ఇద్దరు ఎంపీలు, ఒక రాజ్యసభ సభ్యుడు, ముగ్గురు ఎంఎల్‌సిలు, 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే 50 శాతం అంటే 56 మంది నోటీసుపై సంతకాలు పెట్టి జిల్లా కలెక్టర్‌కు అందజేయాల్సి ఉంటుంది. ఈ నెల 18 తర్వాత ఈ పని చేసేందుకు కూటమి పార్టీలు సన్నాహాలు చేస్తున్నాయి. ఇప్పటికే సంతకాల సేకరణ కూడా పూర్తిచేసినట్లు తెలుస్తోంది. జిల్లా కలెక్టర్ ఈ కాన్ఫిడెన్స్ మోషన్ (అవిశ్వాస తీర్మానం) కాపీలను పరిశీలించి జివిఎంసి కమిషనర్‌కు సంతకాల వెరిఫికేషన్ కోసం పంపాల్సి ఉంటుంది. అయితే ఇంతవరకూ కూటమి పాలనలో జివిఎంసి కమిషనర్‌ను నియమించలేదు. కలెక్టరే ఇన్‌ఛార్జి బాధ్యతలు చూస్తున్నారు. ఈ రెండు రోజుల్లో ఏం జరుగుతుందో చూడాలి.

డిప్యూటీల కోసం
కూటమి పార్టీల మధ్య సిగపట్లు

జివిఎంసి మేయర్ పదవి కోసం ఒకే ఒక్క పేరు టిడిపికి చెందిన 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు విషయంలో ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలుస్తోంది. డిప్యూటీ మేయర్ పదవులను ప్రస్తుతం వైసిపిలో ఉన్న జియ్యాని శ్రీధర్, కట్టమూరి శ్రీధర్ అనుభవిస్తున్నారు. అవిశ్వాస తీర్మానం అయ్యాక కౌన్సిల్‌ను సమావేశ పరిచి చేతులెత్తడం ద్వారా మేయర్, డిప్యూటీ మేయర్‌లను మిగతా 2లో..

విశాఖలో పరీక్ష రాసేందుకు వచ్చిన అంధ విద్యార్థినులు

టెన్త్ తొలిరోజు ప్రశాంతం

విశాఖలో 28,540, అనకాపల్లిలో 20967 మంది విద్యార్థులు హాజరు

ప్రజాశక్తి - ఆరిలోవ/అనకాపల్లి విలేకరులు

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ప్రశాంత వాతావరణంలో టెన్త్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాల వద్ద ఉదయానికే సందడి వాతావరణం కనిపించింది. విశాఖ జిల్లా వ్యాప్తంగా 134 కేంద్రాల్లో నిర్వహించిన మొదటి రోజు పరీక్షకు 28,659 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 28,540 మంది హాజరయ్యారు. 119 మంది గైర్హాజరయ్యారు. సార్వత్రిక విద్యాపీఠ్ ఎస్ఎస్‌సి పరీక్షలు జిల్లాలో 15 కేంద్రాల్లో జరిగాయి. మొదటి రోజు హిందీ పరీక్షకు 57 మంది విద్యార్థులకుగాను 49 మంది హాజరయ్యారు. జిల్లా అబ్జర్వర్ దేవానందరెడ్డి ఆరు పరీక్షా కేంద్రాలను, జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ 10 కేంద్రాలను, స్క్వాడ్ బృందాలు 32 కేంద్రాలను సందర్శించాయి.

అనకాపల్లి జిల్లాలో 107 పరీక్షా కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 20967 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం వారిచే నిర్వహించిన ఏడు కేంద్రాల్లో 211 మందికి 166 మంది హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అనకాపల్లి భాష్యం మిగతా 2లో..

ఉపాధి పని కల్పనలోనూ రాజకీయమేనా!

వార్త 8లో..

పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలి

వార్త 8లో..

రొయ్యల పరిశ్రమ బస్సు బోల్తా

వార్త 8లో..

సిఐఎస్‌ఎఫ్ సైక్లోథాన్‌కు ఘనస్వాగతం

విశాఖకు చేరుకున్న సైక్లోథాన్ బృందం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారత తూర్పు, పడమటి తీర ప్రాంతాల గుండా 6553 కిలోమీటర్ల తీర రేఖలో సాగుతున్న సిఐఎస్‌ఎఫ్ కోస్టల్ సైక్లోథాన్-2025కు విశాఖలో సోమవారం ఘన స్వాగతం లభించింది. సైక్లోథాన్ బృందంలోని 50 మంది సభ్యులకు ఆర్‌కె.బీచ్ వద్ద విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు సాదర స్వాగతం పలికారు. ఈ సైక్లోథాన్ తీర ప్రాంత ప్రజలకు జాతీయ భద్రతపై అవగాహన కల్పించేందుకు సాగుతున్న విషయం తెలిసిందే.

విశాఖలో ట్రైనీ ఐఎఎస్‌ల బృందం పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 126వ రౌండ్ ఇన్‌డక్షన్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రాల పౌర సేవల నుంచి ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఎఎస్)కు ఉద్యోగోన్నతి పొందిన వివిధ రాష్ట్రాలకు చెందిన అధికారుల బృందం సోమవారం విశాఖపట్నం పోర్ట్ అథారిటీని సందర్శించింది. అక్కడి పరిస్థితులను తెలుసుకుంది. అనంతరం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోనూ ఈ బృందం పర్యటించింది. జివిఎంసి పరిపాలన విధానం, ప్రాజెక్టులు చాలా అద్భుతంగా ఉన్నాయని ట్రైనీ ఐఎఎస్‌ల గ్రూప్ లీడర్ రక్షన్ పాంట్ మారక్ పేర్కొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

- సేఫ్టీ గిర్డర్‌ను ఢీకొట్టిన లారీ
- విజయరామరాజుపేట వద్ద పక్కకు ఒరిగిన రైల్వే ట్రాక్
- గూడ్స్ లోకో పైలట్ అప్రమత్తతతో సేఫ్

ఒరిగిపోయిన ట్రాక్‌ను పరిశీలిస్తున్న రైల్వే సిబ్బంది

ప్రజాశక్తి - అనకాపల్లి : అనకాపల్లి విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద సోమవారం తెల్లవారుజామున భారీ రాయి లోడుతో వెళ్తున్న గుర్తుతెలియని లారీ బ్రిడ్జి సేఫ్టీ గిర్డర్‌ను ఢీకొట్టింది. అది రైల్వే ట్రాక్‌ను బలంగా తాకడంతో ట్రాక్ పక్కకు ఒరిగింది. ఇదే సమయంలో వస్తున్న గూడ్స్ ట్రైన్ లోకో పైలట్ సుంకర వరహాలు దొర సుమారు వంద మీటర్ల దూరంలో నుంచి ట్రాక్‌ను పరిశీలించి అత్యవసర బ్రేకులను ఉపయోగించి ట్రైన్‌ను నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. అదే సమయంలో పాసింజర్ రైలు గనుక వచ్చి ఉంటే భారీ ప్రాణ నష్టం జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. రైలు ట్రాక్ ఒరిగిపోయిన నేపథ్యంలో మూడు గంటలపాటు ఆ ట్రాక్‌లో రైళ్ల సేవలు నిలిచిపోయాయి.

ప్రమాద విషయం తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అక్కడకు వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. టిడిపి నాయకులు సురేంద్ర, జోగి నాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ), సిపిఐ నాయకులు రాజాన దొరబాబు, తదితరులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆందోళన వ్యక్తం చేశారు. అనధికార మైనింగ్‌లో భాగంగా వందల వాహనాలు రోజూ హెవీ లోడ్‌తో వెళ్తున్నా ఇటు మైనింగ్ అధికారులుగానీ, అటు పోలీస్, రవాణా శాఖ అధికారులుగానీ పట్టించుకోకపోవడంతోనే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అనకాపల్లి ప్రాంతంలో క్వారీలకు అనుమతులు లేనప్పుడు వందల సంఖ్యలో లారీలు రోజూ 60 నుంచి 70 టన్నుల లోడ్‌తో ఎలా వెళ్తున్నాయని ప్రశ్నిస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతోనే ఈ తతంగం జరుగుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

నిర్లక్ష్యం వల్లే ప్రమాదం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

వార్త 5లో..

ధర్నాలు.. వినతులు

మొదటి పేజీ తరువాయి..

అవిశ్వాస వ్యూహాలు

మెజారిటీ సభ్యులు ఎన్నుకోనున్నారు. డిప్యూటీ మేయర్ పదవుల కోసం జనసేన, బిజెపి గట్టిగానే సిగపట్లు పడుతున్నట్లు తెలుస్తోంది. మేయర్ పదవి టిడిపికి ఇచ్చేశాక డిప్యూటీలు రెండూ తమకు కావాలని పట్టుపట్టడంతో పంచాయతీ ఆయా పార్టీల అధిష్టానం వద్దకు వెళ్లింది. ఏదేమైనా మంగళవారం నుంచి జివిఎంసిలో సీను మారనున్నట్టు తెలుస్తోంది.

అనకాపల్లిలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

టెన్త్ తొలిరోజు ప్రశాంతం

స్కూల్‌ను సందర్శించారు. రాష్ట్ర స్థాయి పరిశీలకులు పి.శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు ఐదు పరీక్ష కేంద్రాలను, 7 స్క్వాడ్ బృందాలవారు 44 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

జర్నలిస్టు సంఘాల ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కూటమి ఎన్నికల మ్యానిఫెస్టో హామీ మేరకు జర్నలిస్టులకు 4 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని పలు జర్నలిస్టు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్ఎన్ఎ అధ్యక్షుడు ఇ.సత్యనారాయణ, ఎపియుడబ్ల్యూజె అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రాము, ఆర్.రామచంద్రరావు, జాప్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శ్రీనివాస్, కెఎం.కీర్తన్, టిజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.జార్జి పాల్గొన్నారు.

విఎంఆర్‌డిఎ ప్రజా దర్బార్‌కు స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు స్పందన లభించింది. చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గడువులోగా ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రజా దర్బార్‌కు 23 ఫిర్యాదులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. జెసి కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ అన్నారు. సోమవారం ఉదయం సిరిపురంలోని విఎంఆర్‌డిఎ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఎంఆర్‌డిఎ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మొదటిసారిగా ప్రజాదర్బార్‌ని ప్రారంభించి సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటి వరకు 122 వినతులురాగా వాటిలో 59ను పూర్తిస్థాయిలో పరిష్కరించామని తెలిపారు. ప్రతి 15 రోజులకూ ఒకసారి ప్రజాదర్బారుకి వచ్చిన వినతులపై సమీక్షిస్తున్నట్టు తెలిపారు. 'ది డెక్' పేరిట మల్టీ లెవల్ కార్ పార్కింగ్ భవన నిర్మాణాన్ని వేగవంతం చేశామని పేర్కొన్నారు. రూ.80 కోట్ల వ్యయంతో నౌక నమూనాలో నిర్మించామని, ఇందులో 1.90 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో పార్కింగ్ సదుపాయం, సుమారు 1.60 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కమర్షియల్ స్థల సదుపాయం ఉందని అన్నారు. తీర ప్రాంత కోతను నియంత్రించేందుకు ధాన్ ఫౌండేషన్ సహకారంతో 1200 మొక్కలను ఇప్పటికే నాటామన్నారు.

ప్రభుత్వ పాఠశాల భవనం పున: ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందుస్తాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) ఇనిషియేటివ్‌లో భాగంగా హెచ్ఎస్ఎల్ కాలనీలో పునరుద్ధరించిన ప్రభుత్వ పాఠశాలను పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, సిఎస్ఎల్ కమిటీ సభ్యులు, యూనియన్ ప్రతినిధుల సమక్షంలో హెచ్ఎస్ఎల్ టెక్నికల్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ మహాపాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన, స్ఫూర్తిదాయక అభ్యసన వాతావరణాన్ని అందించడం, ఈ ప్రాంతంలో విద్యా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు.

నిరసన తెలుపుతున్న ఆరోగ్య మిత్రలు

విశాఖ కలెక్టరేట్ సోమవారం ధర్నాలతో దద్దరిల్లింది. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తమ కష్టాలను చెప్పుకునేందుకు వచ్చిన వారితో కిటకిటలాడింది.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఎపి వైద్య మిత్ర కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు వి.నాగమల్లీశ్వరి (మల్లిక) కార్యదర్శి పి.అప్పలరాజు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

సుగుణ ఆత్మహత్య కారకులను అరెస్టు చేయాలి

విశాఖపట్నం టూ టౌన్ పరిధిలో ఈ నెల 6న మత్స్యకార మహిళ బొడ్డు సుగుణ ఆత్మహత్యకు పాల్పడటానికి కారకులైన వారిని తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్, సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడారు. సుగుణ ఆత్మహత్యకు కారకులైన ఉమ్మిడి ధనలక్ష్మి, భరత్ కుమార్, గోపి, రాజ్ కుమార్, వాసుపల్లి రత్నంలను కఠినంగా శిక్షించాలన్నారు.

ఓలా, ఉబర్, రాపిడో యాప్‌లో తిరుగుతున్న డ్రైవర్ల సమస్యలపై..

ఓలా, ఉబర్, రాపిడో యాప్‌లో తిరుగుతున్న డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. అనంతరం యూనియన్ గౌరవ అధ్యక్షులు బి.జగన్, అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కె.పోలినాయుడు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఓలా యాప్‌లో విశాఖపట్నంలో సుమారుగా 4 వేల మంది లింక్ అయి ఉన్నారన్నారు. పది సంవత్సరాల నుండి అనేక ఇబ్బందులకు వారంతా గురవుతున్నారని తెలిపారు. గతంలో డిటిసి దగ్గర అంగీకరించిన అంశాలను కూడా అమలు చేయకుండా వ్యవహరిస్తున్నారని, దీంతో కారు ఓనర్లు, డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదుల వెల్లువ

జివిఎంసి కాంట్రాక్టర్లు నిరసన

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు దాదాపు ఏడాది కాలంగా బకాయి ఉన్న రూ.400 కోట్లును చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట కాంట్రాక్టర్లు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు..ఈ సందర్భంగా గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గొంప చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి రంది సాధూ రావు మాట్లాడారు

IN THE HONOURABLE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT : VISAKHAPATNAM

E.P 273/15 O.S 491/14

Between:
V. సరోజిని ...D.Hr.
And
B. అప్పలరాజు ...J.Dr.

వేలం ప్రకటన

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూల్ ఆస్థిపై నంబరు డిక్రీ బాకీ సొమ్ము రాబట్టే నిమిత్తము పైన ఉదహరించిన న్యాయస్థానములో **తేది 15-04-2025 ఉ॥10-30ని॥ల నుండి సాయంత్రం 5గం॥ల** మద్య కాలములో బహిరంగముగా వేలం షరతులకు లోబడి వేలము కాబడును. కావున కావలసినవారు (వేలములో పాల్గొనువారు) పై తేదీన పై కోర్టులో కోర్టు ఎదుట హాజరై వేలంలో పాల్గొనవచ్చునని యిందు మూలముగా తెలియపరచడమైనది.

వేలం ఆస్థి వివరములు

విశాఖపట్నం, విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి గొల్లకంచరపాలెం, (56వ వార్డు) కంచరపాలెం, ఆసెన్‌మెంట్ నెం.67310, టౌన్ సర్వే నెం.17 ప్రకారం విస్తీర్ణం 52 చదరపుగజములు లేక 43.478 చ॥మీ॥ స్థలములో D.No.56-9-5/Aతో ఉన్న **R.C.C. స్లాబు యిల్లుకి హద్దులు :**
తూర్పు : 4 అడుగుల రోడ్డు
దక్షిణం : పండావారి స్లాబు యిల్లు
పడమర : నైదాన నారాయణరావు యిల్లు
ఉత్తరం : మున్సిపల్ రోడ్డు
పై హద్దుల మద్య J.Dr కి హక్కు గల సమస్థమైన ఆస్థి.

D.Hr. Value : Rs.9,00,000/-
Amina Value : Rs.15,00,000/-
Hearing Date : 15-04-2025
Further Hearing : 22-04-2025
V.KOTESWARA RAO
Advocate for D.Hr
Kancharapalem, Visakhapatnam
Cell : 9849589945

మహారాజశ్రీ విజయనగరం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు (స్పెషల్ మొబైల్ కోర్టు) విజయనగరం

IA:215/2020 IA: 216/2020 OS: 471/2020

Between :
వనువు రాములమ్మ ....వాది
And :
గండిబోయిన సూరి మరియు వగైరాలు...ప్రతివాది
To
D5. భుత్తల ఏర్రమ్మ, W/o గురయ్య, R/o గంటలాం గ్రామం, డెంకాడ మండలం, విజయనగరం జిల్లా.
D6. వనువు నరసియ్యమ్మ, W/o అప్పారావు, R/o పెద్దిపాలెం గ్రామం, భీమునిపట్నం మండలం, విశాఖపట్నం జిల్లా.

పై నెంబరు గల దావాను వాదిగారు పై కోర్టునందు నమోదు చేయగా శ్రీ కోర్టువారు వాదిని ఆర్డరు జారీ చేసిన విధంగా ఈ నోటీసు పంపించడం జరిగినది. ఈ దావా **తేది 04-04-2025 ఉదయం గం॥ 10-30 ని॥ల**కు మీరు గాని, మీ న్యాయవాది గారి ద్వారాగాని పై కోర్టునకు హాజరై మీ వాదనను తెలియవలెను. లేని యెడల శ్రీ కోర్టువారు మీకు పరోక్షంగా తీర్మానించుదురు అని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

కె.రవిబాబు
అడ్వకేట్,
విజయనగరం,
సెల్: 9440343921

మహారాజశ్రీ రాజాం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS 91/2018 EP 12/2024

వాది - DHR : పిసిని మహాలక్ష్మి
ప్రతివాది - JDR : సుంకరి దేవి
To
JDR: సుంకరి దేవి, W/o లేటు డోల రాజు, సిస్టర్ ఇంచార్జి, గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్, విశాఖ పోర్టు ట్రస్టు, సాలిగ్రామపురం, విశాఖపట్టణం, విశాఖపట్టణం జిల్లా.

వాది - DHR పై నెంబరు అమలు మీపైని పై కోర్టులో Depositగా యున్న మీ యొక్క లీవ్‌శాల ఇప్పించుట మూలంగా, అమలు సొమ్ము ఇప్పించే నిమిత్తం పై నెంబరు అమలు దాఖలు చేసినందున మీకేమైనా ఆక్షేపణలున్న యెడల **తే 2-4-2025దీని ఉదయం 10-30 గం॥లకు** పై కోర్టువారి ఎదుట హాజరై మనవి చేసుకోవలెను. నీవు అటుల జరిపించని యెడల నిన్ను ఎక్స్‌పార్టీ చేసి, DHRకు అవసరమగు ఆర్డర్లు జారీ చేయడమగునని మీకు యిందు మూలముగా తెలియజేయడమైనది.

యస్. పోలారావు
DHR తరపు న్యాయవాది,
రాజాం - 532127,
విజయనగరం జిల్లా.
సెల్ : 9985913883

మహారాజశ్రీ శృంగవరపుకోట జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

IA 388/2023 OS 75/2019

Between :
ఇందుకూరి సనపల విష్ణుప్రియ సౌజన్య ....వాది
And :
ఇందుకూరి శివప్రసాద్ వగైరాలు ....ప్రతివాదులు
To
R4. ఇందుకూరి భానుచంద్ర, S/o సుధాకర్, 39-22-28/10, Kalinga Nagar, Visakhapatnam - 530007

దావా నోటీసు

పై దావాలో వాది ఇందుకూరు శివప్రసాద్ వగైరాలు ప్రతివాదులపై ప్లైంట్ షెడ్యూలు దాఖలా భూములు పంపకము నిమిత్తమై పై దావా దాఖలు చేసియున్నారు. పై కోర్టులో పై దావాలో ప్లైంట్ సవరణ పిటిషను కూడా దాఖలు చేసియున్నందున అందుకు మీకు ఆక్షేపణలున్న ఎడల పై కోర్టులో స్వయముగా కాని సరియైన బోగట్టా యివ్వబడిన న్యాయవాది ద్వారా కాని తెలియపరచుకొనవలెను. లేని ఎడల పై దావా మీ పరోక్షమందు తీర్మాణింపబడి **తే 28-3-2025దీన పగలు 10-30 గంటల** లగాయితు తెలియపరచుకొనవలెను.

M.Kameswara Rao
Advocate for Plaintiff
Srungavarapukota

గ్రామ పంచాయతీ కార్యాలయము - ఈ.బోనంగి

రేఖా నెం.01/2025 **టెండరు నోటీసు** **తేదీ.15-03-2025**

అనకాపల్లి జిల్లా, పరవాడ మండలం, ఈ.బోనంగి గ్రామ పంచాయితీలో 2025-26 సంవత్సరమునకు గాను పంచాయితీ పరిధిలో కాంట్రాక్ట్ పద్దతిపై Sanitation పనులకు నలుగురు (4), వీధి దీపములు నిర్వహణకు ఒకరిని (1), మంచినీటి సరఫరా ట్యాంక్లు నిర్వహణకు ఇద్దరు (2), పారిశుధ్యం పనులకు గాను తడిచెత్త-పొడిచెత్తను ఇంటింటి నుండి (door to door collection) సేకరించి చెత్త నుండి సంపద తయారీ కేంద్రమునకు తరలించుటకు పంచాయతీకు ఆదాయం వచ్చు విధముగా తీర్చిదిద్దుటకు ఒక మోటార్ వెహికల్‌నకు డ్రైవర్‌ను ఒకరు (1) మరియు అదే విధముగా బ్లీచింగ్, లైమ్, ఫీనాయిలు మరియు ఇతర పారిశుద్య సామగ్రి మరియు వీధి దీపాల సామగ్రి సప్లయ్ చేయుటకు అదే విధముగా వీధి కుక్కలను సురక్షతంగా పట్టి కుటంబ నియంత్రణ ఆపరేషన్ చేయుటకు గాను, స్టీల్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు తేది: 26-03-2025 మధ్యాహ్నం 3 గంటల వరకు తీసుకొని అదేరోజు హాజరైన టెండరుదారు సమక్షంలో పంచాయితీ కార్యాలయంలో టెండర్లు తెరవబడును. టెండర్లు దాఖలు చేయు వ్యక్తులు తప్పనిసరిగా నెల మనిషికి రేటు తెలుపవలెను. అదే విధంగా మెటీరియల్ యొక్క ఒకక్క దాని విలువ తెలపవలెను. మిగిలిన విషయాలు పంచాయితీ కార్యాలయం పని చేయు వేళల్లో తెలుసుకొనవచ్చును. టెండర్లును వాయిదా వేయుటకు గాని రద్దు చేయుటకు గాని ఈ క్రింది సంతకదారుని యొక్క అధికారికి కలదు.

వ. నెం	పని పేరు	తేదీ	టెండరు ధరావత్తు
1.	శానిటేషను పనులు	1-4-2025 టు 31-03-2026	300/-
2.	వీధి దీపములు నిర్వహణకు	1-4-2025 టు 31-03-2026	300/-
3.	మంచినీటి సరఫరా నిర్వహణకు	1-4-2025 టు 31-03-2026	300/-
4.	తడి చెత్త పొడి చెత్త తరలించుటకు మోటార్ వెహికల్ డ్రైవర్	1-4-2025 టు 31-03-2026	300/-
5.	పారిశుద్య సామగ్రి సప్లయ్ (బ్లీచింగ్, లైమ్, ఫినాయిలు)	1-4-2025 టు 31-03-2026	600/-
5.	వీధి దీపాల సామగ్రి సప్లయ్	1-4-2025 టు 31-03-2026	600/-
6.	వీధి కుక్కలను సురక్షతంగా పట్టి కుటంబ నియంత్రణ ఆపరేషన్ చేయుటకు గాను	1-4-2025 టు 31-03-2026	300/-

సం/- శ్రీ పంచాయితీ కార్యదర్శి
ఈ.బోనంగి గ్రామపంచాయితీ, పరవాడ మండలం

మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలు పరిష్కరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

ప్రజాశక్తి- లీగల్ : మధ్య వర్తిత్వం ద్వారా ఎక్కువ వివాదాలు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు నూతన న్యాయస్థానాల భవనాల సముదాయం సమావేశ మందిరంలో గ్రామీణ ప్రాంత న్యాయవాదుల సంఘాలకు చెందిన న్యాయవాదులకు 40 గంటల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ నెల 21వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందని గిరిధర్ తెలిపారు. సుప్రీంకోర్టు మీడియేషన్, కన్సిలేషన్ ప్రాజెక్ట్ కమిటీకి చెందిన సీనియర్ శిక్షకులు ఎస్.అరుణాచలం, బీనా దేవరాజ్, విశాఖపట్నం జిల్లా 10 మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీలకు చెందిన 30 మంది న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మాట్లాడుతూ భారతదేశంలో మధ్యవర్తిత్వం ద్వారా తక్కువ వివాదాలు పరిష్కరించబడుతున్నాయని, ఈ సంఖ్యను పెంచాల్సిన ఆవశ్యకత ఉందని న్యాయవాదులకు సూచించారు. పెండింగ్ కేసులను తగ్గించడం ద్వారా న్యాయవాదులకు నష్టం ఉందని, అది వారి వత్తి గౌరవం పెంచుతుందని తెలిపారు. మధ్యవర్తులుగా శిక్షణ పొందిన న్యాయవాదులను నియమిస్తారని, ఆ కేసులను పరిష్కరించడంలో మధ్యవర్తిత్వ మెళకువలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు సుప్రీంకోర్టు కేసులను ఉదహరిస్తూ ప్రత్యామ్నాయ వివాద పరిష్కార మార్గాలైన లోక్ అదాలత్, ఆర్బిట్రేషన్, జ్యుడిషియల్ సెటిల్మెంట్, మీడియేషన్, కన్సిలేషన్ గురించి వివరించారు. ప్లీ బార్గయినింగ్, రాజీమార్గాలు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్

పాపను కన్నతల్లే చిదిమేసింది

రిమాండ్‌కు తరలింపు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవలో దారుణం చోటుచేసుకుంది. ఐదు నెలల కుమార్తెను కడతేర్చింది. భార్యాభర్తల మధ్య గొడవలో, భార్యపై అనుమానమో మరి ఏకారణమో కాని చివరికి అభం శుభం తెలియని చిన్నారి బలైపోయింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... ఆరిలోవ పోలీస్‌స్టేషన్ పరిధి పెదగదిలి సింహగిరి కాలనీలో దంపతులు గొర్లె వెంకట రమణ, శిరీష నివాసముంటున్నారు. వీరికి 12 ఏళ్ల తరువాత ఆడ శిశువు జన్మించింది. ఈ నెల 13వ తేదీన మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కుమార్తెను దిండుతో నొక్కి శిరీష చంపేసింది. అనంతరం తెన్నేటి పార్కు బీచ్ వద్దకు తీసుకెళ్లి నీటిలో పడేసి, తిరిగి తన చేతిలోకి తీసుకుంది. అక్కడ నుంచి తన భర్త వెంకటరమణకు ఫోన్ చేసి, పాప చనిపోయిందని, తాను కూడా చనిపోతున్నానని సమాచారం ఇచ్చింది. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న వెంకటరమణ పాప బ్రతికే ఉంటుందని నగరంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే శిశువు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భర్త వెంకటరమణ ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో పాపను తనే ఇంటి వద్ద చంపేసానని శిరీష అంగీకరించడంతో ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు రిమాండ్‌కు తరలించారు. తల్లే కన్న కూతురిని చంపడానికి భర్త అనుమానమో, గొడవలో ముఖ్యకారణం కావచ్చని పలువురు అనుమానిస్తున్నారు.

నేర నియంత్రణలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : నగరంలో శాంతి భద్రతల దృష్ట్యా నేరాల నియంత్రణలో భాగస్వాములు కావాలని ద్వారకా సబ్ డివిజన్ ఏసిపి అన్నెపు నర్సింహమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం 'నగరంలో శాంతి భద్రతలు- నేరాలు నియంత్రణ' అంశంపై ద్వారకా సబ్ డివిజన్ పరిధిలోని హోటళ్లు, లాడ్జీలు, బార్ అండ్ రెస్టారెంట్, వైన్ షాపు యజమాన్యాలతో ఆరిలోవ, తోటగరువు, వెర్నిదుర్గమాంబ కల్యాణమండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి అన్నెపు నర్సింహమూర్తి మాట్లాడుతూ, నేర నియంత్రణలో భాగంగా ప్రతి ఒక్కరూ సిసి కెమెరాలు ఏర్పాటుచేయాలని, డిజిటల్ మోనిటరింగ్ సిస్టమ్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, హోటళ్లలో మైనర్లను అనుమతించకుండా చర్యలు చేపట్టాలని, ఆడ, మగ వచ్చినట్లయితే వారి రిలేషన్‌ను, ఆధార్ కార్డులను నిశితంగా పరిశీలించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా చూడాలని కోరారు. పోలీసు శాఖకు డ్రోన్లను డొనేట్ చేసి నేర నియంత్రణలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ద్వారకా సిఐ వెంకటరమణ, ఆరిలోవ ఎస్ఐ శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కీళ్ల నొప్పులకు చికిత్స

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామంలో యాక్టివ్ మూమెంట్ వారి ఫిజియోథెరపీ, ఫిట్‌నెస్ అండ్ వెల్నెస్ హబ్ ద్వారా అన్ని రకముల కీళ్ల నొప్పులకు ఫిజియోథెరపీ ఫిట్‌నెస్ పరికరాలతో నేచురల్ పద్ధతిలో చికిత్స అందిస్తున్నట్లు డాక్టర్ ఎ.సాయిలత తెలిపారు. ఆనందపురం కూడలిలోని గోపి మెడికల్ షాప్ సమీపంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయాలు లేక సుదూర ప్రాంతాలకు వెళ్లి రోగులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో పెద్దిపాలెంలో ఫిజియోథెరపీ ఫిట్‌నెస్ పరికరాల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం అందించడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కొవ్వు, ఊబకాయం ఉన్న వారికి ప్రత్యేకమైన థెరపీల ద్వారా చికిత్స అందిస్తామని తెలిపారు. స్త్రీలలో వచ్చే సమస్యలకు ఈ ఫిట్‌నెస్ థెరపీ దోహదపడుతుందన్నారు. ఢిల్లీలో ప్రత్యేకమైన శిక్షణ పొంది గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి యాక్టివ్ మూమెంట్ పేరిట హాస్పటల్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ముఖ్యంగా మాన్యువల్ థెరపీ, పిఎన్ఎఫ్, కప్పింగ్ థెరపీ, స్ట్రెంగ్త్ శిక్షణ, కోల్డ్ అండ్ హాట్ థెరపీ ద్వారా వివిధ రకాల వ్యాధులను నయం చేస్తున్నామన్నారు. ప్రతిరోజూ ఉదయం 9 నుండి సాయంత్రం ఏడు గంటల వరకు, ఆదివారం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. వైద్య శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన థెరపీ నిమిత్తం ఆసుపత్రికి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆకుల దేవేంద్ర కుమార్, గోపి మెడికల్ షాప్ యజమాని కొట్యాడ గోపి, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నొప్పులకు చికిత్స అందిస్తున్న డాక్టర్

బంగారం, నగదు చోరీ

ప్రజాశక్తి -సీతమ్మధార :నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక ఇంట్లో బంగారం, నగదు చోరీ అయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.... అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ సమీపంలోని సరోజ ఆసుపత్రి సమీపంలో రేయి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో నివాసముంటున్నారు. ఇతను ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. కింది అంతస్తులో తల్లిదండ్రులు వాసుదేవరావు, లక్ష్మీకాంతమ్మ ఉంటున్నారు. గోపాలపట్నం చంద్రంపాలెంలో ఉంటున్న కుమార్తెలు ఇంటికి తల్లిదండ్రులు ఆదివారం వెళ్లి అక్కడ ఉండిపోయారు. శ్రీనివాసరావు రాత్రికి తిరిగి ఇంటికి చేరుకున్నారు. సోమవారం ఉదయం పెద్ద కుమారుడు శ్రీనివాసరావు కింద అంతస్తులోకి చూసేసరికి ఇంటి తాళాలు తెరిచి ఉండడం గమనించి బీరువాలో తనిఖీచేగా 17 తులాల బంగారం, ఆభరణాలు చోరీ అయ్యాయని గుర్తించారు. నాలుగు గాజులు, రెండు చైన్లు నల్లపూసల దండ, 3 ఉంగరాలు, చెవి దిద్దులు, 25వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. మొత్తం రూ.4.50 లక్షల విలువ మేరకు చోరీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటన స్థలానికి క్రైమ్ డిసిపి లతా మాధురి, ఏసిపి లక్ష్మణరావు, సిసిఎస్ సిఐలు పోరా రామారావు, సిఎస్ వెంకటనారాయణ, ఫోర్త్ టౌన్ క్రైమ్ సిఐ రాజుల నాయుడు నాలుగో పట్టణ క్రైమ్ ఎస్ఐ సత్యారావు చేరుకొని వివరాలు సేకరించారు. కుమారుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పోక్సో చట్టంపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. 18 ఏళ్ల లోపు వయసున్న బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని విశాఖ సిబిఐ ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి సిఎస్.మూర్తి స్పష్టం చేశారు. స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ స్టేషన్ సిఐ బి.తిరుమలరావు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సర్వేలను పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న పి 4 సర్వే, వర్క్ ఫ్రం హోం, ఎంఎస్ఎంఇ సర్వేలను ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. రేవిడి, కోరాడ, బిఆర్.తాళ్లవలస, రెడ్డిపల్లిలో పర్యటించి సర్వేలను పర్యవేక్షించారు. సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. గాయత్రీ హాస్పిటల్ ఎదురుగా సుమారు (65) వయసు గల వ్యక్తి సోమవారం మృతి చెంది ఉన్నట్లు తెలిపారు. మృతుడు ఆఫ్ ప్యాంట్ ధరించి మాసిన గెడ్డంతో ఉన్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని కెజిహెచ్ శవగారంలో భద్రపరిచినట్లు సిఐ తెలిపారు. సంబంధిత బంధువులు ఉంటే పిఎం పాలెం పోలీసులను సంప్రదించాలని సిఐ కోరారు.

తల్లిదండ్రుల చెంతకు యువకుడు

ప్రజాశక్తి -పెందుర్తి : అదృశ్యమైన నాయుడుతోట ప్రాంతానికి చెందిన జుజ్జూరు శివ గణేష్ ఆచూకీని పోలీసులు కనిపెట్టారు. నాయుడుతోట ప్రాంతానికి చెందిన జుజ్జూరు శివగణేష్ (23) ఈ నెల 7వ తేదీన కనిపించకుండా పోయిన ఘటనపై, అతని కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి వెంటనే దర్యాప్తు చేపట్టారు. ఇన్‌స్పెక్టర్ వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యాన హెడ్ కానిస్టేబుల్ స్వామి చురుకుగా స్పందించి శివ గణేష్ ఆచూకీని కనిపెట్టారు. అతన్ని సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. పెందుర్తి పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం బాకురుపాలెం గ్రామ సమీపంలో వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బాకూరుపాలేనికి చెందిన పలికల రమేష్ (26) వైజాగ్‌లోని హెచ్‌పిసిఎల్‌లో పని చేస్తున్నాడు. ఇతనికి ఒక కుమారుడు (1), భార్య భారతి ఉన్నారు. రమేష్ మద్యానికి బానిసై తండ్రితో ఘర్షణపడి గ్రామం దగ్గర కల్లాలు సమీపంలో ఉన్న గుడి వద్దకు వెళ్లి ఉరి పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమీపంలో ఉన్న చిన్నాన్న చూసి కిందకి దింపేసరికి అప్పటికే మృతి చెందాడు. మృతుని భార్య భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సిఐ వాసు నాయుడు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈ నెల 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన జివిఎంసి ఒకటో వార్డు తగరపువలస కుమ్మరి వీధికి చెందిన కొప్పాక మాధవీలత (33) కనబడుట లేదని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. రెండేళ్లగా మానసిక వ్యాధితో ఇబ్బంది పడుతుందని, ఏడాది క్రితం ఇలానే ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్లి నట్లు మాధవీలత తమ్ముడు వెంకట శ్రీధర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏడాది క్రితం అదృశ్యమవ్వగా బరంపురం పోలీసులు అప్పట్లో తమకు ఇచ్చిన సమాచారం మేరకు ఇంటికి తీసుకొచ్చినట్లు ఫిర్యాదులో తెలిపారు. మాధవీలత తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడు అదృశ్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని సింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన కాళ్ల బంగార్రాజు (62) ఈ నెల 13వ తేదీ నుంచి కనబడుట లేదని అతని కుమార్తె తుపాకుల హేమలత సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాను ఇంట్లో వాష్ రూమ్‌కు వెళ్లి వచ్చేసరికి తన తండ్రి బంగార్రాజు 13వ తేదీ ఉదయం 11 గంటల నుంచి కనబడ లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన తల్లి అప్పల కొండమ్మ సుమారు 4 నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా అప్పటి నుంచి తన తండ్రి మానసికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. గతంలో నాలుగు సార్లు ఇలానే ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చారని తెలిపారు. కుమార్తె హేమలత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేకలు, గొర్రెలు స్వాధీనం

భీమునిపట్నం : మండలంలోని రేఖవానిపాలెం, జివిఎంసి నాల్గో వార్డు తిమ్మాపురం, కొత్తవలస గ్రామాల్లో ఇటీవల మేకలు, గొర్రెలు అపహరణకు గురైన విషయం విదితమే. బాధితుల ఫిర్యాదు మేరకు నేర విభాగం పోలీసులు రంగంలోకి దిగి నిందితులను అదుపులోకి తీసుకుని సోమ వారం అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో విశాఖ, కైలాస పురానికి చెందిన షేక్ జిలాని, తాటిచెట్లపాలేనికి చెందిన రాగోలు ప్రశాంత్ కుమార్, మారికవలస రాజీవ్ గృహకల్పకు చెందిన పత్తికాయల కనకరాజు ఉన్నారు. వారి నుంచి రూ 27 వేలు, రెండు మేక పోతులు, ఒక గొర్రె పోతు, ఆటో, వెస్పా స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక క్రైమ్ ఎస్ఐ సూర్య ప్రకాశ రావు తెలిపారు.

చలివేంద్రంలో మజ్జిగను పంపిణీచేస్తున్న పోలీసులు

పెందుర్తి పోలీసు స్టేషన్ వద్ద చలివేంద్రం

ప్రజాశక్తి-పెందుర్తి : వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పెందుర్తి పోలీస్ స్టేషన్ ఎదుట ప్రజల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్ చలివేంద్రాన్ని ప్రారంభించి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రజలకు, ప్రయాణికులకు, స్థానికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రజలు దాహంతో ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ చలివేంద్రం వేసవిపూర్తయ్యే వరకు కొనసాగుతుందని చెప్పారు.

జాన్సన్ లిఫ్ట్స్‌కు ఆళ్వార్ దాస్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- వేపగుంట : జాన్సన్ లిఫ్ట్ విశాఖపట్నం విభాగానికి డిప్లమా ట్రైనీలు, డిఇటి ఇంజనీరింగ్ సిబ్బంది నియామకానికి నిర్వహించిన జాబ్ మేళాలో 34 మంది ఆళ్వార్‌దాస్ విద్యార్థులు ఎంపికైనట్లు జాన్సన్ లిఫ్ట్ హెచ్ఆర్ మేనేజర్ అలిక్యా చెప్పారు. ఈ నియామక డ్రైవ్‌లో ఆళ్వార్ దాస్ పాలిటెక్నిక్, సమీప కాలేజీల నుండి 157 మంది డిప్లమో విద్యార్థులు (ఈసీఈ, ఈఈఈ, మెకానికల్) పాల్గొన్నట్లు అలిక్యా తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 25న బాధ్యతలు ప్రారంభించనున్నారని, ఇంకా విద్యార్హిక కోర్సులు పూర్తి చేసిన తర్వాత మిగిలిన అభ్యర్థులు జాయిన్ అవుతారని వివరించారు. ఎంపికైన విద్యార్థులను ఆళ్వార్ దాస్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాహుల్ అభినందనలు తెలిపారు. ఆళ్వార్ దాస్ గ్రూప్ సెక్రటరీ డాక్టర్ ఎస్‌వీహెచ్.రాజేంద్ర, క్యాంపస్ కో-ఆర్డినేటర్ జివిఎస్.భగవాన్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ యు.గోపి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.తులసీ కృష్ణకుమార్, ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

గోకాడ చెరువు కబ్జాపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి ప్రశాంతినగర్‌లో సుమారు 2.70 ఎకరాలు ఉన్న గోకాడ చెరువు చాలా వరకు కబ్జా గురైందని సోమవారం బోరా రాజీవ్ స్పందనలో ఫిర్యాదు చేశారు. ఇప్పుడు కొత్తగా వాకింగ్ ట్రాక్ పనులు చేపడుతున్నారని, దీనివల్ల కొంత భాగం ఖాళీగా ఉండటంతో ఆ ప్రదేశాన్ని స్థానిక నాయకులు ఆక్రమించడానికి చూస్తున్నారని పేర్కొన్నారు. ఆ ఖాళీ ప్రదేశాన్ని కాపాడాలని ఫిర్యాదులో కోరారు. అధికారులు సర్వే చేసి ప్రభుత్వ భూమి చుట్టూ కంచె వేయాలని కోరారు.

ఆటల పోటీల్లో పాల్గొన్న పిల్లలు

షీలానగర్‌లో ఆటల పోటీలు

ప్రజాశక్తి -గాజువాక : సిపిఎం సీనియర్ నాయకులు జి సుబ్బారావు ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని జివిఎంసి 69వ వార్డు పరిధి షీలానగర్‌లో స్థానిక కమిటీ, ఐద్వా ఆధ్వర్యాన సోమవారం ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు, చిన్నపిల్లలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతూ, ప్రజలు, కార్మికుల సమస్యలపై సుబ్బారావు అలుపెరగని పోరాటం చేశారని గుర్తుచేశారు. జివిఎంసి కార్మికుల సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటం చేశారన్నారు. సుబ్బారావుకు చిన్నపిల్లలంటే చాలా ఇష్టమని తెలిపారు. మహిళలు, చిన్నపిల్లలు కోరిక మేరకు ఆటలు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఆయన వర్ధంతిని ఏప్రిల్ 1వ తేదీన జరిపి ఆటల పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జి.మణి, ఎస్.నాగవేణి, ఎం.మాధవి, డి.శ్రీదేవి, మాధురి, సునీత, కళ్యాణి పాల్గొన్నారు.

59వ వార్డులో సిపిఎం ఇంటింటి సర్వే

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 59వ వార్డు పరిధి హనుమాన్‌నగర్, ఎక్స్‌సర్వీస్ మెన్ కాలనీ, ములగాడ హౌసింగ్ కాలనీ, వాయుపుత్ర కాలనీలో సిపిఎం నాయకులు ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సర్వేలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పాల్గొన్నారు. డ్రైనేజీలు పూర్తిగా పాడైపోవడంతో రోడ్డు పైకి నీరు చేరి దోమలతో ఇబ్బందులు పడుతున్నామని, ఈ ప్రాంతంలో పందుల సమస్య తీవ్రంగా ఉందని కాలనీ ప్రజలు సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. సొంత ఇల్లు లేక, అద్దెలు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, ఈ సమస్యలపై అధికారులకు దరఖాస్తులు పెట్టి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. సిపిఎం కార్యకర్తలు అప్లికేషన్ రాయడానికి వస్తారని, సంతకాలు చేసి సంబంధిత అధికారి దగ్గరకు మీరంతా రావాలని జగ్గునాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. ములగాడ హౌసింగ్ కాలనీలో ఇంటి స్థలం కోసం రూ.35 వేలు కట్టించుకున్నారని, ఇంతవరకు ఇల్లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అనకాపల్లిలో స్థలం చూపించారని, కూలి పని చేసుకునే తాము అంత దూరం వెళ్లలేమని, స్థానికంగా ఇవ్వాలని కోరారు. గ్యాస్ డబ్బులు పడలేదని, ఇంటి పన్ను పేర్లు మార్పుచేయాలని, ఇల్లు ఉన్న వారికి రిజిస్ట్రేషన్‌తో సంబంధం లేకుండా పక్కా గృహాలు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు స్కీమ్ మంజూరు చేయాలని తదితర సమస్యలను సిపిఎం బృందం దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. ఈ సర్వే కార్యక్రమంలో జోన్ కమిటీ సభ్యులు ఆర్.లక్ష్మణమూర్తి, బూడి శ్రీను, కె.రమణ, ఏరియా కార్యదర్శి డి.రాజేష్, జె.రామునాయుడు, సిపిఎం కార్యకర్తలు ప్రశాంత్, ఎం.శ్రీను, రామకృష్ణ, పైడినాయుడు, ఈశ్వరరావు, డి.రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

న్యాయవాదుల సంఘం ఎన్నికలకు జోరుగా నామినేషన్లు

ప్రజాశక్తి-విశాఖ లీగల్ : విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికలకు సంబంధించి సోమవారం భారీగా నామినేషన్లు దాఖలు అయ్యాయి. అధ్యక్ష స్థానానికి ప్రముఖ న్యాయవాది ఎంకె.శ్రీనివాస్, నమ్మి సన్యాసిరావు, ఐఎం.అహమ్మది నామినేషన్ వేశారు. ఉపాధ్యక్షుల కోసం ఎన్‌టిపి గోపాలకృష్ణ, చింతపల్లి ఆనంద్ కుమార్, పిలా మీనాక్షి, ప్రధాన కార్యదర్శి పదవికి ఎల్‌బి.నాయుడు, ఎం.సుధాకర్, సోమేశ్వరరావు, రాపేటి సూర్యనారాయణలు నామ పత్రాలను దాఖలు చేశారు. ఇతర పోస్టులకు మరో 20 మంది న్యాయవాదులు నామినేషన్ వేశారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల వరకు నామినేషన్ స్వీకరిస్తారు. 19వ తేదీన నామినేషన్లను పరిశీలించి, ఉపసంహరణ అనంతరం 20వ తేదీన పోటీలో ఉన్న అభ్యర్థులు జాబితాను ప్రకటిస్తారు. ఇప్పటివరకు 4800 మంది న్యాయవాదులు ఓటు హక్కు కలిగి ఉన్నట్లు ఎన్నికల అధికారి జివి.రెడ్డి వెల్లడించారు. ఎన్నికల నాటికి 6600కు పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. సభ్యత్వ రుసుము చెల్లించడానికి ఈనెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు చెప్పారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉప ఎన్నికల అధికారి సిబిఎస్ లింగరాజు విలేకరులకు తెలిపారు. 28వ తేదీన ఎన్నికలు పూర్తయిన వెంటనే ఆరు గంటలకల్లా లెక్కింపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రాత్రి 9 గంటలకు తుది ఫలితాలను ప్రకటిస్తామన్నారు. ఎన్నికల కౌంటింగ్‌కు తొలిసారిగా సాంకేతిక సహకారం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నియమాలని అనుసరించి తమ ప్రచారాలను కొనసాగించుకోవాలని కోరారు.

ముగిసిన నాటకోత్సవాలు

పిటి మాధవ్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి -మాధవధార : కీర్తిశేషులు సనపల సూర్యనారాయణ, అన్నపూర్ణమ్మ పేరిట మూడు రోజులపాటు నిర్వహించిన స్మారక నాటకోత్సవాలు సోమవారం ముగిశాయి. విశాఖపట్నం పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కెవి.మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్, మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు సంయుక్తంగా నిర్వహించిన ఈ నాటకోత్సవాల్లో వివిధ జిల్లాల నుండి వచ్చిన కళాకారులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి నాటకోత్సవాల్లో పాల్గొన్న ప్రతి కళాకారున్ని అభినందించడంతోపాటు మహిళా కళాకారులకు చీరలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కళాకారులు, రచయితలు, సమాజ సేవకులకు ఆత్మీయ విశిష్ట పురస్కారాలను అందజేశారు. మూడు రోజుల కార్యక్రమాలను ప్రముఖ కళాకారులు చౌదరి అప్పారావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షులు సనపల వరప్రసాద్, అన్నెపు నారాయణరావు, ఈటి రాంబాబు, పి.వెంకటసూర్యనారాయణరాజు, పి.శివప్రసాద్, సనపల శ్రీనివాసరావు, వావిలపల్లి భాను, మూల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ మండపాన్ని పూర్తి చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 69వ వార్డు పరిధి తుంగల్ల గ్రామంలో నిర్మించనున్న తారకరామ కళ్యాణమండపం పనులను తక్షణమే ప్రారంభించాలని వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి కోరారు. కళ్యాణమండపం నిర్మించే ప్రాంతంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 1995 సంవత్సరంలో అప్పటి ఎంపీ ఎంవివిఎస్.మూర్తి నిధులతో సామాజిక భవనం నిర్మించామని తెలిపారు. దాన్ని స్థానంలో రూ.50 లక్షల వ్యయంతో కళ్యాణ మండపం నిర్మాణానికి రెండేళ్ల క్రితం టెండర్లు పిలిచి, శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. పనులు కూడా ప్రారంభించారని పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన జివిఎంసి చీఫ్ ఇంజినీర్ శివప్రసాదరావు చెరువు గర్భం అని చెప్పి పనులను నిలుపుదల చేయడం అన్యాయం అన్నారు. ఈ విషయంపై గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఆరోపించారు. స్థలం గ్రామ కంఠం అని తెలిపారు. శివప్రసాదరావు కావాలనే పనులు జరగకుండా కాంట్రాక్టర్‌ను బెదిరించి నిలుపుదల చేశారని ఆరోపించారు. నిర్మాణానికి తీసిన గుంతల్లో నీరు నిల్వ ఏర్పడిందన్నారు. దీని వల్ల దోమలు పెరుగుతున్నాయని, చిన్నపిల్లలు పడిపోయే ప్రమాదముందని తెలిపారు. పనులు ప్రారంభించకపోతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. తక్షణమే చీఫ్ ఇంజినీర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

గ్రీన్ బెల్ట్ అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాలలో గ్రీన్ బెల్ట్ వాకింగ్ ట్రాకులను అధికారులతో కలిసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సోమవారం పరిశీలించారు. మర్రిపాలెం ఉడా లే-అవుట్ ప్రాంతంలో ఆర్ అండ్ బి జంక్షన్ లలితా డిలైట్ గ్రీన్ బెల్ట్ , వనితా వాకింగ్ ట్రాక్, పాస్ పోర్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న గ్రీన్ బెల్ట్‌లో మోడల్ లైటింగ్, బ్యూటిఫికేషన్ పనులు, వాటర్ సప్లై తదితర అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. ప్రస్తుతం జరుగుతున్న, కొత్తగా మంజూరైన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. కరాస ప్రాంతంలోని పలు కాలనీల్లో 3 ఫేస్ ఎలక్ట్రికల్ లైన్ల పునరుద్ధరణపై అధికారులతో చర్చించారు. తక్షణమే పనులను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఇలు ఉష, అర్పన, హార్టికల్చర్ ఎఇ పల్లవి, టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

జెఎల్ సంఘం జిల్లా కార్యదర్శిగా మాధవరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా కార్యదర్శిగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకులు బూరాడ మాధవరావు ఎన్నికయ్యారు. విశాఖలోని డాక్టర్ వివిఎస్.కృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల జిల్లా స్థాయి ఎన్నికలు జరిగినట్లు మాధవరావు పేర్కొన్నారు. జూనియర్ కళాశాలల అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మాధవరావు ఎన్నిక పట్ల స్థానిక కళాశాల ప్రిన్సిపల్ పి.రాంప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఆంజనేయ ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని గుడ్డివలస అగ్రహారం పంచాయతీ పరిధిలో ఉన్న లింగన్నపేట గ్రామంలో నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయ ఆలయ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి రాతి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా సుమారు 6 గ్రామాల నుండి వచ్చిన 5000 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించామని తెలుగుదేశం నాయకులు పైల శ్రీనివాసరావు తెలిపారు.

బంగారమ్మ పండగ ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని తునివలస బంగారమ్మ పండగ ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొలి కార్యక్రమం ప్రారంభమైంది. మంగళవారం రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తయినట్లు ఉత్సవ కమిటీ తెలిపింది.

తీర ప్రాంత రక్షణకు సైకిల్ యాత్ర

ప్రజాశక్తి -భీమునిపట్నం : తీర ప్రాంత పరిరక్షణ కోరుతూ 9 రాష్ట్రాలను కలుపుకుంటూ 6,553 కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణంలో భాగంగా సిఐఎస్ఎఫ్ బృందం పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడు వరకు చేపట్టిన సైకిల్ యాత్ర సోమవారం స్థానిక బీచ్‌కు చేరుకుంది. ఈ యాత్రలో పాల్గొన్న బృంద సభ్యులకు స్థానిక బోయివీధి, ఎగువపేట, తోటవీధి మత్స్యకార ప్రజలు, సంఘాల పెద్దలు, నాయకులు గంటా నూకరాజు,ఎం.షణ్ముఖరావు స్వాగతం పలికారు.

తరగతుల విలీనంపై అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి- భీమునిపట్నం : 3, 4, 5 తరగతుల విలీన ప్రతిపాదనపై స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయాన్ని సేకరించారు. దీనిపై పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. ఎక్కువ మంది సభ్యులు విలీనం వద్దని చెప్పారు. ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణ రాజు, జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు, ఎంఇఒలు 1, 2 ఎం.శివరాణి, జయప్రద పాల్గొన్నారు.

ప్రజాశక్తి
మంగళవారం 18 మార్చి 2025

ప్రజా సమస్యలపై సిపిఎం ఆధ్వర్యాన ధర్నాలు

ఖాళీ బిందెలతో రాంబిల్లి ఎంపిడిఒ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న ప్రజలు

ప్రజాశక్తి-రాంబిల్లి

సిపిఎం ఆధ్వర్యాన మండలంలో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రల్లో గుర్తించిన సమస్యలపై ఆ పార్టీ ఆధ్వర్యాన సోమవారం మండల తహశీల్దారు, ఎంపిడిఒ కార్యాలయం, జెడ్.చింతవా, కొత్తపట్నం గ్రామ సచివాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు. మహిళలు ఖాళీ బిందెలను తలపై పెట్టుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి.దేవుడు నాయుడు మాట్లాడుతూ తాగునీటి సమస్యను పరిష్కరించాలని, మత్స్యకారులకు గత కాలం వేట నిషేధ పరిహారం అందించాలని, అర్హులైన పేదలకు పెన్షన్లు, ఇల్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, ఎన్ఎడిబి నిర్వాసితులకు పెండింగ్ ప్యాకేజీలు ఇవ్వాలని, నేవీ నిర్మాణ పనుల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలని, స్మార్ట్ మీటర్లు ఆపాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై ఆయా అధికారులకు వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ధోని కాసియా, నాగు, మంత్రి నారాయణరావు, ఎరుపెల్లి రాము, చెల్లూరి నూకన్నా, చోడిపల్లి పవన్ కుమార్, చోడిపల్లి అప్పలరాజు, సిహెచ్.గంగరాజు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సబ్బవరం : ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని ప్రజా సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఉప్పాడ సత్యవతి మాట్లాడుతూ వీధి కాలువలు, మంచినీళ్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మొల్లేటి గౌరేశ్వరరావు, యూనియన్, ఆటో, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

విశాఖపట్నం : జివిఎంసి 51వ వార్డు పరిధి ఏకలవ్యకాలనీ ప్రజలకు వెంటనే ఇళ్ల పట్టాలివ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన గోపాలపట్నం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ఆధ్వర్యాన తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ, 50 సంవత్సరాలకుపైబడి ప్రభుత్వ స్థలమైన ఏకలవ్య కాలనీలో పక్కా ఇళ్లు నిర్మించుకొని ప్రజలు నివసిస్తున్నారని, నేటి వరకు వారికి ఇంటి పట్టాలు ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా జిఒ 30 ప్రకారం ఏకలవ్య కాలనీలో ప్రతి ఇంటికీ ఇళ్ల పట్టా ఇవ్వాలని కోరారు. ఇంటిపట్టాలు వచ్చేవరకు ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజలు తెచ్చిన దరఖాస్తులను తహశీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కంచరపాలెం జోన్ నాయకులు ఒ.అప్పారావు, శ్రావణ్, జి.శ్రీనివాసరావు, కాలనీ ప్రజలు ఎ.అప్పారావు, ఎ.రవి, ఎ.శ్రీను, ఎ.పిట్టోడు, ఎ.కాంతమ్మ, ఎ.సత్య, పి.శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

అధికారుల నిర్లక్ష్యం వల్లే రైల్వే బ్రిడ్జి ప్రమాదం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అనకాపల్లి విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి ప్రమాదం జరిగిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం విమర్శించారు. విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి సేఫ్టీ గడ్డర్‌ను క్వారీ రాళ్లను తీసుకెళ్తున్న లారీ సోమవారం తెల్లవారు జామున ఢీకొట్టడంతో రైల్వే ట్రాక్ పక్కకు జరిగిన నేపథ్యంలో విషయం తెలిసిన వెంటనే లోకనాథం నేతృత్వంలోని సిపిఎం బృందం ఆ ప్రాంతానికి వెళ్ళి పరిశీలించింది. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ప్రమాదం జరిగిన విషయాన్ని ఆ మార్గంలో వస్తున్న గూడ్స్ రైలు లోకోపైలట్ వరహాలు దొర గుర్తించి వెంటనే రైలును నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పిందని తెలిపారు. అదే ప్రయాణికులు ప్రయాణించే రైలు అయితే ఎంత పెద్ద ప్రమాదం సంభవించేదో ఉహించలేమన్నారు. క్వారీల యాజమాన్యాలు తమ ఇష్టారాజ్యంగా పరిమితికి మించి హెవీ లోడ్లు తరలిస్తున్నా ఆర్టీఒ అధికారులు గాని, బ్రేక్ ఇన్‌స్పెక్టర్లుగాని పట్టించుకోవడం లేదని, అందువల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. రైల్వే అండర్ బ్రిడ్జిలు వున్న ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ ప్రమాదాన్ని దృష్టిలో వుంచుకొని వెంటనే లక్ష్మీదేవిపేట వద్ద నిర్మాణంలో ఆగిపోయిన ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఈ ప్రమాదానికి కారణమైన క్వారీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు బి.ఉమామహేశ్వరరావు, అల్లు రాజు, నాయకులు కె.తేల్లయ్యబాబు, ఎం.రమణ, బి.నూకఅప్పారావు తదితరుల పాల్గొన్నారు.

దెబ్బతిన్న రైల్వే ట్రాక్ వద్ద సిపిఎం నేత లోకనాథం, ఇతర నాయకులు

అధిక లోడు లారీలను పట్టణంలోకి రాకుండా చర్యలు చేపట్టాలి : టిడిపి

ఆర్టీవో, మైన్స్, పోలీస్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే సోమవారం రైల్వే బ్రిడ్జి ప్రమాదం జరిగిందని టిడిపి నాయకులు ఆరోపించారు. ప్రమాద స్థలాన్ని టీడీపీ నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, టీడీపీ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు బీయస్ఎంకే జోగి నాయుడు మాట్లాడుతూ అధిక లోడుతో పట్టణంలోకి క్వారీ లారీలు రాకుండా చూడాలని, అధికలోడుతో లారీలు వెళ్తున్న చర్యలు తీసుకోలేని రవాణాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రమాద సమయంలో మనుషులు ఉంటే, ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. దీనిపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులు ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకోవాలి : కలెక్టరు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రత్యేక అధికారులు స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం అమలుకు ఒక్కో గ్రామం చొప్పున దత్తతీసుకొని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టం విజయ కృష్ణన్ సూచించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మండల స్థాయి సమన్వయ కమిటీలు, స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం అజెండా అమలుపై నియోజకవర్గ, మండల, మునిసిపాలిటీల ప్రత్యేక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయి సమన్వయ కమిటీలు పనితీరును వేగవంతం చేయాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదం, గ్రామాలలో పరిశుభ్రతపై రానున్న మూడు వారాలలో ప్రత్యేక అధికారులు వారి పరిధిలో పర్యవేక్షణ వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి అధికారి ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని ప్లాస్టిక్ రహిత ఆదర్శ గ్రామంగా మార్చాలన్నారు. అచ్చుతాపురం మండలం ఎం.జగన్నాథపురం గ్రామాన్ని జిల్లా కలెక్టరు దత్తత తీసుకున్నట్లు తెలిపారు. గ్రామాలలో కాలువలు పూడిక తీయాలని, మురుగునీరు సక్రమంగా ప్రవహించేలా కాలువల అనుసంధానం చేయాలని, మురుగునీరు మంచినీటి వనరులలో కలువకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి చెత్తను వేరుచేసేలా తడిచెత్త, పొడిచెత్తలకు డస్ట్ బిన్ పద్ధతి అమలు చేయాలన్నారు. మునిసిపాలిటీల పరిధిలో పారిశుధ్యంపై ప్రత్యేక దష్టి పెట్టాలనానరు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, కెఆర్‌సిసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి, పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ విజయకృష్ణన్, జెసి జాహ్నవి

రైల్వే ట్రాక్ ప్రమాదంపై జరిమానా

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక విజయరామరాజు పేట అండర్ బ్రిడ్జి వద్ద సోమవారం తెల్లవారుజామున రాళ్లతో వస్తున్న క్వారీ లారీ రైల్వే గిర్డర్‌ను కొట్టి ట్రాక్‌ను ఢీకొనడంతో ట్రాక్ దెబ్బతిన్న ఘటనపై జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తీవ్రంగా స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు అనకాపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటనారాయణ సంబంధిత లారీని అదుపులోకి తీసుకుని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ద్వారా రూ.1,01,730 జరిమానా విధించారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే అధిక లోడుతో ప్రయాణించే లారీ యజమానులను పిలిపించి, ప్రమాదాలకు కారణమైన, నిర్లక్ష్యంగా లారీలు నడిపిన డ్రైవర్లకు హెచ్చరించడం జరిగిందని తెలిపారు. క్వారీ లారీలు, గూడ్స్ లారీలపై ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. లారీ యజమానులు, డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు.

సిసిఎల్ కార్మికులను ఆదుకోవాలి

- క్షతగాత్రులకు సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని ధర్మవంరం దగ్గర గల కోస్టల్ కార్పొరేషన్ లిమిటెడ్ (సిసిఎల్) కార్మికులను ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. సిసిఎల్ రొయ్యల కర్మాగారానికి ఏ షిఫ్ట్ కి వస్తున్న బస్సు సోమవారం ఉదయం బోల్తాపడడంతో 30 మందికి గాయాలు కాగా వారిలో 11 మంది అనకాపల్లి ఉష ప్రైమ్ హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తీసుకొచ్చారు. బాధితులను లోకనాథం, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, నాయకులు గంటా శ్రీరామ్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, వారు వారు కోలుకొని తిరిగి డ్యూటీలో వచ్చేవరకు పూర్తి వేతనాలు కంపెనీ యాజమాన్యం చెల్లించాలని డిమాండ్ చేశారు.

రోజు వేతనం రూ.400 ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి-కశింకోట : కసింకోట మేజర్ పంచాయతీలో కార్మికులకు రోజు వేతనం రూ.400 ఇవ్వాలని కోరుతూ పంచాయతీ కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కార్మికులు సోమవారం ర్యాలీ నిర్వహించి, సంతబయలు నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం చేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా వేతనాలు పెరగడం లేదన్నారు. గత నెలలో కలెక్టర్, డిపిఒ, డిఎల్‌పిఒ, ఎంపీడీవో, ఈఓఆర్‌డి, పంచాయితీ సెక్రటరీ, స్థానిక సర్పంచ్, పంచాయతీ బోర్డు మెంబర్లకు వినతిపత్రాల ద్వారా తమ సమస్యలను తెలియజేసినా పరిష్కారం కాలేదని వాపోయారు. ఇప్పటికే మూడు నెలల నుండి జీతాలు చెల్లించలేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కుమార్, కొండబాబు, కోశాధికారి దేవుడు, రామాజీ, రాణి, సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

పబ్లిక్ గ్రీవెన్స్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజలు గ్రామ, మండల స్థాయిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అన్నారు. జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పి.జి.ఆర్.ఎస్.)లో కలెక్టర్‌తో పాటు జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, కె.ఆర్.సి.సి. స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో 40 ఫిర్యాదులు

అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 40 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు స్వయంగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్పై డి.వెంకన్న తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రయాంత 2.0లో డైట్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రయాంత నేషనల్ హ్యాకథాన్లో డైట్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు సోమవారం విద్యార్థులను కళాశాల అధ్యాపక బృందం అభినందించింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వైకుంఠరావు మాట్లాడుతూ ఇండోర్‌లోని అక్రోపోలిస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ నిర్వహించిన ప్రతిష్టాత్మక జాతీయ హ్యాకథాన్ లో రేయా నితిన్, చాందిని దాడి నాయకత్వంలో తమ విద్యార్థుల బృందం తమదైన ముద్ర వేశారన్నారు. సిఎస్ఇ విభాగం హెచ్ఓడి డాక్టర్ కె.సుజాత పాల్గొన్నారు.

కొత్త అమావాస్య జాతర ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శ్రీనూకంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరకు ఏర్పాట్లుపై జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భీమర శెట్టి రాంకీ ఆలయ పరిసర ప్రాంతాలలో సోమవారం పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పండగ ప్రత్యేక అధికారిణి కె శోభారాణి, ఆలయ సహాయ కమిషనర్ ఈవో వెంపలి రాంబాబు, డిఎస్పి శ్రావణి, సిఐలు టీవీ విజయ్ కుమార్, వెంకటనారాయణ, మున్సిపల్ విద్యుత్ అధికారులు, దేవస్థానం మాజీ చైర్మన్ పీలా నాగ శ్రీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం తుమ్మపాల ఇందిరానగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.20 లక్షలతో సిసి రోడ్లకు సోమవారం పనులు ప్రారంభించారు. సర్పంచు తట్ట పెంటయ్య నాయుడు, ఎంపీటీసీ సభ్యులు వెంకటలక్ష్మి, కన్నారావు, భారతి, తర్ర సత్యారావు పనులను పరిశీలించారు.

పాఠశాల శానిటేషన్ వర్కర్ల సమస్యలపై ధర్నా

అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న స్కూల్ శానిటేషన్ వర్కర్లు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీ ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ కొత్తగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 300 మంది విద్యార్థులకు ఒకే శానిటేషన్ వర్కర్‌ను పెట్టడంతో స్కూలు పరిసరాలు, క్లాస్ రూములు, బాత్రూములు వంటివి శుభ్రం చేయడం చాలా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఎస్.రాయవరం మండలంలోని పాఠశాలలో ఒక వర్కర్ బాత్ రూమ్‌లో పడి మరణించారని గుర్తు చేశారు. వర్కర్లకు ఎటువంటి ఇన్సూరెన్స్ సౌకర్యం లేదన్నారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు డ్యూటీ చేస్తున్నా నెలకు రూ.6 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని, ఆ వేతనాలు కూడా ప్రతి నెల చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, భద్రత కల్పించాలని, పిఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు శివలక్ష్మి, ప్రధాన కార్యదర్శి పి.జానకి, నాయకులు పి.రవి, జి.ఉమ, సంతోషి, మణి, లక్ష్మి, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

శానిటేషన్ వర్కర్లకు వేతనాలు పెంచాలి

విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి జి.మంగశ్రీ, సిఐటియు విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు పి.మణి మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న ప్రతి 50 మంది విద్యార్థులకు ఒక శానిటేషన్ వర్కర్‌ను నియమించాలని, ప్రతి నెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రస్తుతం వీరికి చెల్లిస్తున్న నెలవారీ వేతనం రూ. 6 వేలు ఏమాత్రమూ సరిపోవడం లేదన్నారు. ప్రస్తుతం 300 మంది విద్యార్థుల సంఖ్యకు ఒక శానిటేషన్ వర్కర్‌ను నియమిస్తున్నారని, దీని వల్ల ఇప్పుడు పనిచేస్తున్న వారిపై తీవ్ర పని ఒత్తిడి పడుతోందని తెలిపారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, సర్వీసులో చనిపోయిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. ఐడి కార్డులు, రెండు జతల యూనిఫారం ఇవ్వాలని కోరారు. రాజకీయ వేధింపులు, కక్ష సాధింపులతో జరుగుతున్న తొలగింపులను ఆపాలని డిమాండ్ చేశారు.

విశాఖపట్నం కలెక్టరేట్ ఎదుట..

కౌలు రైతులకు సిసిఆర్ కార్డులు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-కె.కోటపాడు : కౌలు రైతులకు సిసిఆర్ కార్డులు అందజేసి రుణ సదుపాయం కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎమ్మార్వో రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. అత్యధిక శాతం కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారని వారికి సదుపాయాలు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వము ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మేరకు కౌలు రైతు చట్టం పగడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎర్ర దేవుడు, ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు అయోడిన్ పరీక్షలు

ప్రజాశక్తి-యలమంచిలి : మండలంలోని జంపపాలెం, షేక్లిపాలెం పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం 'అయోడిన్' లోప రుగ్మత నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రేగుపాలెం వైద్యాధికారిణి డాక్టర్ సుగుణ మాట్లాడుతూ పరీక్షించిన విద్యార్థుల నుండి సేకరించిన యూరిన్, అయోడిన్ పరీక్షల ఫలితాల కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి పంపామని చెప్పారు. రిపోర్టుల అనంతరం వారికి చికిత్సలు అందిస్తామని తెలిపారు. అయోడిన్ లోపం ఉన్నవారు అయోడిన్ ఉప్పు వాడాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, లక్ష్మీకుమారి, భవాని, ఎహెచ్ సురేష్, రమణమ్మ, పాఠశాలల హెచ్ఎంలు వైఎన్.రాజు, ఏవిహెచ్.శాస్త్రి పాల్గొన్నారు.

వడ్డాది వెంకన్న ఆలయం హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది వెంకన్న 152వ కల్యాణోత్సవాలు ఈ నెల 10 నుండి 15వ తేదీ వరకు జరిగిన నేపథ్యంలో స్వామి వారి ఆలయం హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది స్వామివారికి రూ.2.67,640 ఆదాయం అధికంగా వచ్చింది. హుండీలలో రూ.7,86,406, టికెట్లు అమ్మకం ద్వారా రూ.4,08665, తలనీలాలు రూ.25వేలు, కొబ్బరి చిప్పలు వేలం ద్వారా రూ.38వేలు, ఆశీలు రూ.9160, విరాళాలు రూ.8435, మొత్తం రూ.12,75,666 వచ్చినట్లు ధర్మకర్త దొండా కన్నబాబు, ఈఓ టిఎన్ఎస్ శర్మ తెలిపారు. గత ఏడాది రూ.10,08,026లు వచ్చిందని చెప్పారు. ఎస్సై ఏ శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు దొండా సన్యాసిరావు, వీర్ల సురేష్, దేవాదాయ శాఖ సిబ్బంది, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు టిడిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పెదపూడి పంచాయతీ శివారు రాజుపాలెంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో నమ్మి పైడయ్య, చిలుకుకు చెందిన మేకలు, 3 పశువులు, పాకలు పూర్తిగా కాలిపోవడంతో మండల టీడీపీ అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు తదితరులు సోమవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాదంలో గాయపడిన జీవాలకు వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాము బగాది, స్థానిక సహాయకులు సునీల్, వీఆర్వో రామారావు, గ్రామ సర్పంచ్ వరకృష్ణ, నేమాల సత్యనారాయణ, నమ్మి సత్యనారాయణ పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావుకు, జెడ్పి మాజీ ఛైర్ పర్సన్ లాలం భవానికి సోమవారం మాజీ ఎంపీ పప్పల చలపతిరావు చేతుల మీదుగా టిడిపి సభ్యత్వ కార్డులను అందజేశారు. అచ్యుతాపురంలో సోమవారం జరిగిన సమావేశంలో చలపతిరావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలందరూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి పరిశీలికులు బొండా జగన్నాథం, పార్టీ నాయకులు కొలుకులూరి విజయరామరాజు, రాజాన సూర్య నాగేశ్వరరావు, కాండ్రకోట చిరంజీవి, ఇత్తంశెట్టి రాజు, గొర్లి నానాజీ, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, బొద్దపు శ్రీనివాసరావు, ఆడారి ఆదిమూర్తి, కోటారు సాంబ, రాజాన నారాయణమ్మ, గోన్నాబత్తుల నాగేశ్వరరావు, నమ్మి రమణ, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ పాల్గొన్నారు.

దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : కె.కోటపాడు సిఐ పరిధిలోని దేవరాపల్లి, ఏ కోడూరు, కే కోటపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతన జరిగినప్పుడు ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దేవాలయాల్లో సీసీ కెమెరా ఏర్పాటుపై అవగాహన, ఉపయోగాలు, దేవాలయాల్లో దొంగతనాలు జరిగినప్పుడు ఆధారాలు భద్రపరచడం మొదలగు వాటిపై తెలియజేశారు. కార్యక్రమంలో సిఐ. పైడప్ప నాయుడు, కె.కోటపాడు ఎస్సై. ధనుంజయ్, ఎ.కోడూరు ఎస్సై. లక్ష్మీనారాయణ, జిల్లా క్లూస్ టీం హెడ్ కానిస్టేబుల్ త్రినాధ్, సిపి నాయుడు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో సమస్యలపై ఐద్వా ధర్నా

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని గొర్లివానిపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న టిడ్కో గృహాల్లో నివాసిస్తున్న ప్రజలకు మౌళిక వసతులు కల్పించాలని, కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎంపిడిఓ కార్యాలయం వద్ద అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపిడిఓ ధర్మారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ టిడ్కో గృహాల్లో ఉన్న చెత్తను తొలగించడంలేదని, రేషన్ వెహికల్ రావడం లేదని, వీధి లైట్లు లేక రాత్రి సమయంలో దొంగతనాలు జరుగుతున్నాయని, విషసర్పాలు సంచరిస్తున్నాయని తెలిపారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఎంపిడీఓ ధర్మారావు మాట్లాడుతూ సంబంధిత అధికారులకు ఈ ఫిర్యాదు పై నివేదిక పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఏరియా కమిటీ సభ్యులు బంగారమ్మ, హిందుమతి, సురమ్మ, పి.లక్ష్మీ, అన్నపూర్ణ, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-పరవాడ : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి గిరాకీ ఉందని, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఎంపిడీఓ ధర్మారావు, మండల వ్యవసాయ అధికారి చంద్రావతి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రైతు సాధికార సంస్థ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచర్ పార్మింగ్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు ఏర్పాటు చేశారు. మండలంలోని తానాం గ్రామంలో 3 ఎకరాలు, వెన్నెలపాలెం 2 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన కాయగూయలు, ఆకుకూరలు, పండ్లను ఈ ప్రదర్శనలో ఉంచారు. పలువురు అధికారులు ఈ కాయగూరలను ఆకుకూరలను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అధిక లోడుతో వెళుతున్న వాహనాలను నియంత్రించాలి

ప్రజాశక్తి-మునగపాక : అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు మార్గంలో అధికలోడుతో వెళుతున్న వాహనాలను నియంత్రించి ప్రమాదాలను నివారించాలని వైకాపా రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనకాపల్లి కేంద్రంగా చేసుకొని ఒక మైనింగ్ మాఫియా ఈ ప్రాంత వాసుల ప్రాణాలతో చెలగాటమాడుతుందని ఆరోపించారు. ఈ మార్గంలో అధికలోడుతో వెళుతున్న లారీలను నియంత్రించాలని ప్రజల ప్రాణాలు కాపాడాలని పలుమార్లు ప్రభుత్వాధికారులకు మొరపెట్టుకున్న ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వెలిబుచ్చారు. లారీల నుండి రాళ్ళు పడి కాళ్లు, చేతులు విరిగిన ఘటనలు అనేకం ఉన్నాయని, చనిపోయిన వాళ్ళ ఉన్నారని తెలిపారు. ఇంత జరిగిన ఆర్టీవో, రెవిన్యూ, మైనింగ్, పోలీసు యంత్రాంగం పట్టించుకోవడం లేదని, అధికార పార్టీ నాయకుల మెప్పుకోసం చోద్యం చూసే పరిస్థితి ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో అచ్యుతాపురం, మునగపాక మండలాల ప్రజా ప్రతినిధులు, పలు గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

వాగును కప్పి అక్రమంగా నిర్మించిన షాపులను తొలగించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : దేవరాపల్లి మండలం ముషిడిపల్లి సమీపంలో దుబ్బిరెడ్డి బందకు నీరు సరఫరా అయ్యే వాగును కప్పి అక్రమంగా నిర్మించిన షాపులను వెంటనే తొలగించాలని సోమవారం గ్రామ రైతులు షాపు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబరు 589, 580-2లో దుబ్బిరెడ్డి బందకు వాగు నీరుపారే రెండు కల్వర్టులను మూసి వేసి షాపు నిర్మాణం చేశారని, దానిని బ్రాందీ షాపుకు అద్దెకు ఇచ్చినట్లు బోర్డులు పెట్టారని తెలిపారు. వెంటనే ఈ ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా వేపాడ మాజీ ఎంపీపీ వేచలపు చినరామునాయుడు, స్థానిక నాయకులు బోజంకి సూర్యనారాయణ, చిరికి వెంకటరమణ, బోజంకి అచ్చుతరామయ్య, వేచలపు సింహాద్రప్పడు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులు ఆధార్ ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి-యలమంచిలి : మండలంలోని రేషన్‌కార్డుదారులంతా మార్చి నెలాఖరులోగా ఆధార్ ఈ-కెవైసీ చేయించుకోవాలని తహశీల్దార్ వరహాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-కెవైసీ పెండింగ్ జాబితా ఆయా ప్రాంత డీలర్ల వద్ద ఉందని, పెండింగ్ కార్డు దారులు డీలరు వద్దకు వెళ్లి ఈ కెవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని కోరారు. చేయించుకోని వారికి ఏప్రిల్ రేషన్ సరుకులు ఇవ్వడం జరగదని పేర్కొన్నారు.

సొంత నిధులతో టెన్త్ విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు తరలింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : మండల పరిషత్తు కోఆప్షన్ సభ్యులు బొండా అప్పలరాజు, కొండుపాలెం జెడ్పి హైస్కూల్ కమిటీ ఛైర్మన్ బొండా ఉమా తమ సొంత నిధులతో ఆ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులను ఆటోల్లో సోమవారం పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లారు. 30 మంది విద్యార్థుల్ని ఆటోల ద్వారా మామిడిపాలెం హైస్కూల్ పరీక్షా కేంద్రానికి ప్రతి రోజూ తీసుకెళ్లి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేసామని వారు తెలిపారు.

రైతులు పశుబీమా చేయించుకోవాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : పశువులు కలిగిన ప్రతి రైతూ పశు బీమా చేయించుకోవాలని చౌడువాడ పశు వైద్య అధికారి బి సింహాచలం నాయుడు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పశు బీమా చేయించుకున్న వారికి ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుందని, 20 శాతం రైతు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో కింద పశువులకు గడ్డి పెంచడానికి ఏడాదికి ఒక ఎకరానికి రూ.60 వేలు ఇస్తుందని చెప్పారు. చౌడువాడ పశువుల ఆసుపత్రి వద్ద పశువులకు కావలసిన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బంది కనకారావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఉపాధి హామీ చట్టం కింద కూలి పనులు కల్పించాలని కోరుతూ మండలంలోని తిమ్మరాజుపేట గ్రామ సచివాలయం ఆవరణలో సోమవారం సిపిఎం ఆధ్వర్యాన ఉపాధి కూలీలు ధర్నా చేశారు. అనంతరం సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి 100 రోజులు ఉపాధి పని కల్పించాలని చట్టం చెబుతున్న నేటికీ తిమ్మరాజుపేట గ్రామంలో పనులు కల్పించకపోవడం అన్యాయమన్నారు. కేంద్రం ప్రభుత్వం ఉపాధి హామీకి నిధులు తగ్గించిందన్నారు. బడ్జెట్లో నిధులు కేటాయించు తగ్గించడం వలన ఉపాధి కూలీలకు పనులు కల్పించడం లేదని చెప్పారు. పనులు కల్పించలేని పక్షంలో కూలీలకు జీవనానికి భృతి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము, నాయకులు కె.సోమనాయుడు, నడుపూరు. సన్యాసిరావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : గ్రామాల అభివృద్ధికి ముందుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని దేవరాపల్లి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అన్నారు. దేవరాపల్లి ఎంపిడీఓ కార్యాలయంలో బ్లాకు పంచాయతీల అభివృద్ధికి భవిష్యత్ ప్రణాళికపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఎంపిడీఓ సువర్ణరాజు అధ్యక్షతన సోమవారం జరిగింది. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగాభవాని, ఏఓలక్ష్మీనారాయణ, ఏఈఈలు తేజ, కర్రి శంకరరావు, చంద్రశేఖరు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు పిటిడి బస్సులు ఏర్పాటు

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల రాయడం కోసం, నిర్దేశ పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి ప్రత్యేక పిటిడీ(ఆర్టీసీ) బస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల విద్యార్థులకు బీసీ సంక్షేమ గురుకులాల సొసైటీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిందని చెప్పారు.

ప్రజాశక్తి
మంగళవారం 18 మార్చి 2025

సాఫీగా టెన్త్ పరీక్షలు

వికలాంగ విద్యార్థులకు సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యంపై విమర్శలు

నక్కపల్లిలో క్యూలైన్లలో పరీక్ష గదిలోకి వెళుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - నక్కపల్లి : పదో తరగతి పరీక్షలకు మండలంలోని ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసారు. మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. నక్కపల్లిలో బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, రెసిడెన్షియల్, వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గొడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 938 మందికిగాను 932 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, ఆరుగురు గైర్హాజరైనట్లు ఎంఇఒ నరేష్ తెలిపారు.విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

కోటవురట: మండల కేంద్రంలో రెండు సెంటర్లలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా ముగిశాయి, జిల్లా పరిషత్ పాఠశాలలో 152 మంది హాజరు కావలసి ఉండగా 150 మంది, ప్రభుత్వ పాఠశాలలో 216 మంది మొత్తంగా 368 మందికి గాను 366 మంది హాజరయ్యారు, వికలాంగ విద్యార్థులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంపై విమర్శలు వస్తున్నాయి

మాడుగుల: మండలంలో ఐదు కేంద్రాల్లో సోమవారం మొదటిరోజున పదవ తరగతి తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది, మాడుగుల బాయ్స్ హైస్కూల్‌లో 105 మంది రెగ్యులర్, ముగ్గురు ప్రైవేట్ విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా రెగ్యులర్ విద్యార్థులు 104 మంది హాజరై, ఒకరు గైర్హాజరయ్యారు. ముగ్గురు ప్రయివేటు విద్యార్థులు పరీక్షకు రాలేదు జిల్లా పరిషత్ బాలికలు ఉన్నత పాఠశాలలో 138 మంది, కేజీపురంలో 159 మంది, పూర్తిస్థాయిలో పరీక్షకు హాజరయ్యా తాటిపర్తి సెంటర్లో 151 మందికిగాను ఇద్దరు గైర్హాజరుకాగా, గాను 149 మంది పరీక్షరాశారు మండలంలో ఐదు పరీక్ష కేంద్రాల్లో 706 మంది రెగ్యులర్ విద్యార్థులకు ముగ్గురు, ఐదుగురు ప్రయివేటు విద్యార్థులకు ఒకరు గైర్హాజరైనట్లు ఎంఇఒ దేవుడమ్మ తెలిపారు.

రావికమతం : మండలంలో రావికమతం జడ్పీ హైస్కూలు, మరుపాక మోడల్ స్కూలు, రావికమతం, ,దొండపూడి, కొత్తకోట జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాల్లో పది పబ్లిక్ పరీక్షలు జరిగాయి. 819 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను నలుగురు గైర్హాజరు కాగా మంది, 815 మంది పరీక్షలు రాశారిన ఎంఇఒ తలుపులు తెలిపారు. అలాగే నలుగురు ప్రయివేటు విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదన్నారు.

అనకాపల్లి డెస్క్ : గొలుగొండ మండలంలోని చీడిగుమ్మల, ఏఎల్.పురం, గొలుగొండ మూడు కేంద్రాల్లో టెన్త్ విద్యార్థులు పరీక్షలు రాశారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పరీక్షా కేంద్రాల వద్ద మంచినీరు, వైద్య సదుపాయం ఏర్పాటు చేశారు. గొలుగొండ ఎస్ఐ పీ.రామారావు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు.

పరవాడ : మండలంలో పదో తరగతి పరీక్షలు తొలి రోజు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పెదముషిడివాడ, లంకెలపాలెం, వాడచీపురుపల్లి, పరవాడ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో మొత్తం 5 పరీక్ష కేంద్రాలను పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 504 మంది బాలురు, 489 మంది బాలికలు పరవాడ మండలానికి చెందిన వారు, 44 మంది అచ్యుతాపురం మండలానికి చెందిన వారు పరీక్షలకు హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ, గొండుపాలెం, కె.కోటపాడు, ఎ.కోడూరు, మేడిచర్ల, పాతవలస, కొరువాడ జెడ్పి హైస్కూళ్ల నుండి 485 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ కె.సత్యనారాయణ తెలిపారు కె.కోటపాడులో రెండు, ఎ.కోడూరులో ఒకటి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

సబ్బవరం : మండలంలోని సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రతిభ విద్యాలయం, మదర్ స్కూల్, సన్బ్రిడ్జ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, రావులమ్మపాలెం జడ్పి హైస్కూల్ తదితర పరీక్షా కేంద్రాలలో 928 మంది రెగ్యులర్, 12 మంది ప్రైవేటు విద్యార్థులకుగాను తొలి రోజు మదర్ పబ్లిక్ స్కూల్‌లో ఇద్దరు, రావులమ్మపాలెం జడ్పి హైస్కూల్‌లో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ ఎస్.లక్ష్మణరావు చెప్పారు.

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం దిబ్బిడి, వడ్డాది జెడ్పి హైస్కూళ్లలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. దిబ్బిడి పరీక్షా కేంద్రంలో ముగ్గురు, వడ్డాది పరీక్ష కేంద్రంలో నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈ-2 కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. బుచ్చయ్యపేట మండలం నుండి 577 మంది టెన్త్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

యలమంచిలి : యలమంచిలిలో శ్రీచైతన్య హైస్కూలు, కొత్తపేట హైస్కూలు, బాలికల పాఠశాల, సెయింట్‌మేరీ హైస్కూలు తదితర నాలుగు పదో కేంద్రాల్లో మొత్తం 875 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 870 మంది హాజరైనట్లు అధికార్లు తెలిపారు. వివరాల కోసం ఎంఈఓ 2కి ఫోన్ చేసినా అందుబాటులో లేరని, సమాచారం అందించడంలో విద్యాశాఖాధికారులు తరచూ అలసత్వం వహిస్తున్నారని పాత్రికేయులు అసహనం వ్యక్తం చేశారు.

విశాఖలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

అనకాపల్లి డెస్క్ : దేవరాపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 230 మంది, తెనుగుపూడిలో 204 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసినట్లు చీఫ్ సూపరిండెంటెంట్లు అజాక్, బి.పడాల దాసు తెలిపారు.

భీమునిపట్నం : టెన్త్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో 14 పరీక్షా కేంద్రాల్లో 2,858 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 12 మంది గైర్హాజరయ్యారని ఎంఇఒ ఎం.శివరాణి తెలిపారు

పద్మనాభం : మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో మొదటి రోజు 710 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ఎంఇఒ పి.రమణ తెలిపారు. ఆర్‌వి.పురం పరీక్షా కేంద్రంలో ఒక విద్యార్థి పరీక్షకు హాజరు కాలేదు.

వికలాంగ విద్యార్థులకు ఇలాగేనా ఏర్పాట్లు?

తల్లిదండ్రుల సాయంతో మెట్లెక్కి వెళుతున్న కావ్య

కోటవురట్ల : పదోతరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకార్యలను కల్పించామని చెబుతున్న విద్యాశాఖ అధికారులు, వికలాంగ విద్యార్థినిని ఇబ్బందులకు గురిచేయడంపై విమర్శలు వస్తున్నాయి. వికలాంగ విద్యార్థులు పరీక్ష కేంద్రంలో తనకు కేటాయించిన సీటు వద్దకు వెళ్లేందుకు ర్యాంపు సౌకర్యం లేని పరిస్థితుల్లో, మొదటి అంతస్తులో అయినా చోటు కల్పించాల్సి ఉండగా, కోటవురట్లలోని ఒక కేంద్రంలో పరీక్ష రాసేందుకు వచ్చిన జల్లూరు గ్రామానికి చెందిన రాజాన కావ్య అనే వికలాంగ బాలికకు మొదటి అంతస్తులో సీటు కేటాయించడంతో, ర్యాంపు లేని పరిస్థితుల్లో మెట్ల మార్గంలో తండ్రి సాయంతో నానా అవస్థలు పడుతూ పరీక్ష రాసేందుకు వెళ్లింది. తన బిడ్డకు కింది అంతస్తులో సీటు కేటాయిం చాలని కావ్య తండ్రి శ్రీను కోరుతున్నారు.

దేవరాపల్లిలో తల్లిదండ్రుల సాయంతో పరీక్షలకు వచ్చిన వికలాంగ విద్యార్థినులు

అవస్థలు నడుమ టెన్త్ పరీక్షలకు

అనకాపల్లి డెస్క్ : దేవరాపల్లి మండలం కాశీపురం జెడ్పి హైస్కూల్‌లో చదువుతున్న మానసిక వికలాంగు రాలు సిమ్మ దుర్గమ్మ పదో తరగతి పరీక్ష రాసేందుకు దేవరాపల్లి ప్రభుత్వ పాఠశాల పరీక్షా కేంద్రానికి తల్లిదండ్రుల సహకారంతో హాజరైంది. కలిగొట్ల హైస్కూల్‌లో చదువుతున్న బి.కింతాడకు చెందిన పోలియో బాధితురాలు పెంటకోట శాంతి తల్లి దండ్రులకు సహాయంతో బాధ పడుతూ పరీక్ష రాసేందుకు వచ్చింది. పచ్చ కామెర్లుతో బాధ పడుతున్న కెజీబీవీ విద్యార్థిని డి. తనుశ్రీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరీక్ష రాయడానికి వచ్చింది.

వారపుసంతకు భారీగా చింతపండు

- మంచి ధర పలకడంతో గిరిజన రైతుల ఆనందం
- దళారులు, సిండికేటు వ్యాపారులతో తప్పని నష్టం

వారపుసంతలో గిరిజన రైతులు అమ్మకానికి తెచ్చిన చింతపండు

ప్రజాశక్తి - మాడుగుల: మాడుగుల కేంద్రంలో సోమవారం జరిగే వారపు సంతకు గిరిజన ప్రాంతాలైన సలగుకక్కి, కందులపాలెం ఈదులపాలెం, దేవాపురం, పులుసుమామిడి దరిద్ర గ్రామాల గిరిజనులు చింతపండును భారీగా తీసుకొని వచ్చారు. గత ఏడాది కంటే ఈ ఏడాది చింతపండు దిగుబడి అధికంగా ఉండడంతో ఈవారం అధికంగా చింతపండు వచ్చింది. అయినప్పటికీ 35 కిలోల కావిడ చింతపండు ధర రూ.2 వేలకు పైగానే ధర పలికింది.

దీంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వివిధ ప్రాంతాల నుండి కొనుగోలు చేసేందుకు భారీ ఎత్తున వ్యాపారులు వచ్చారు. కాగా సంతకు చింతపండు అమ్మకానికి తెచ్చిన గిరిజన రైతులకు వ్యాపారులు, దళారుల నుంచి బెడద తప్పడం లేదు. సంత ప్రారంభంలో రైతులు రూ.2 వేలకు పైగా కావిడి విక్రయాలు చేయగా అనంతరం రైతులు చేతుల్లో నుండి దళారీలు లాక్కొని మరి రూ.2500 నుండి రూ.3 వేలకు రూపాయల వరకు విక్రయాలు చేశారు. వారపుసంతల్లో సిండికేట్లుగా మారుతున్న వ్యాపారులు, దళారుల బెడద నుంచి తమకు విముక్తి కల్పించి, చింతపండు, ఇతర అటవీ ఉత్పత్తులకు మంచి ధర పలికేలా అధికారులు తగు చర్యలు చేపట్టాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

భూవివాదంతో పరస్పర దాడులు

ప్రజాశక్తి - రావికమతం:. మండలంలో మేడివాడలో రెండు కుటుంబాల మధ్య భూవివాదం పరస్పరం దాడులకు పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఘువర్మ తెలిపారు.

ఎస్ఐ రఘువర్మ , స్థానికులు సమాచారం మేరకు మేడివాడలో మిలటరీ ఉద్యోగి గొర్లెభాస్కరరావు, ప్రతివాడ కోటేశ్వరరావు కుటుంబాల మధ్యకొన్నాళ్లుగా భూ వివాదంతో తగాదాలు జరుగుతున్నాయి. ఇదే కేసులో మిలటరీ ఉద్యోగి భాస్కరరావు గత ఏడాది అప్పటి ఎస్ఐపై దాడికి తెగబడి, చేయి కొరికాడు. అతనిపై పోలీస్‌స్టేషన్లో రౌడీ షీట్ తెరిచారు .ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో భాస్కరరావు, కోటేశ్వరరావు మధ్య ఘర్షణ తలెత్తి ఇరు కుటుంబాలు వారు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో పతివాడ కోటేశ్వరరావు, భార్య రేవతి, కుమార్తెలు సంధ్య, లావణ్య, గొర్రె భాస్కరరావు, అతడి అన్న సత్తిబాబు, వరహాలమ్మకు తలలకు గాయాలయ్యాయి. దాడుల్లో గాయపడిన భాస్కరరావు వర్గయులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి, పతివాడ కోటేశ్వరరావు కుటుంబీకులను నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్సై తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘు వర్మ తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయండి

ప్రజాశక్తి- మాడుగుల : ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ కూటమి నాయకులు పని చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు కోరారు. సోమవారం మాడుగుల వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో టిడిపి మండల కార్యదర్శి ఉండూరు దేవుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో ఎల్లపుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసిలకు ఈనెలాఖరులోగా రుణదరఖాస్తులు పెట్టుకునే అవగాహన కల్పించాలని, రాయితీపై వ్యవసాయ పనిముట్లు అర్హులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నార.. తెలుగుదేశం సభ్యత్వాలు పొందిన వారంతా బూత్ ఇన్‌ఛార్జిల వద్ద కార్డులను తీసుకోవాలని సూచించారు. ప్రతి 60మంది ఓటర్లకు ఒక కుటుంబ సాధికార మిత్రను ఈనెల 22లోగా నియమించాలని సూచించారు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను కూటమి పార్టీ శ్రేణులంతా సమిష్టిగా, సమన్వయంతో ప్రజల్లోకి తీసుకెళ్లి, వచ్చే సాదారణ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించేందుకు ఇప్పటినుంచే కృషి చేయాలన్నారు. అధికారులెవరైనా కూటమి నేతలను నిర్లక్ష్యం చేస్తే వారి వివరాలను అధిష్టానానికి నివేదిద్దామన్నారు. రానున్న మూడు నెలల్లో నిర్వహించే అభివృద్ధి, సంక్షేమకార్యక్రమాల్లో కూటమి శ్రేణులంతా కలిసి పనిచేయాలని కోరారు.

సాగు హక్కు కల్పించాలని ఆందోళన

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : గొలుగొండ మండలం పాతమల్లంపేట పంచాయతీ గదబపాలెం, చంద్రయ్యపాలెం ఆదివాసీ గిరిజనులకు సాగు హక్కు కల్పించాలని సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. గిరిజన సంఘం గౌరవ సలహాదారు పిఎస్.అజయ్ కుమార్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి సాగులో ఉన్న ఆదివాసీ గిరిజనులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎన్‌ఆర్‌ఐ పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తప్పుడు పేర్లను తక్షణమే తొలగించాలన్నారు.

వారపుసంత ఆశీలు వసూళ్లకు వేలం పాట

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి వారపు సంతలో 2025-26 సంవత్సరానికి ఆశీలు వసూళ్లకు వేలం పాటను మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒ డి సీతారామరాజు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఎంపిడిఒ సీతారామరాజు మాట్లాడుతూ వేలం పాట నిర్వహించగా 28 మంది పాటలో పాల్గొన్నారని, నక్కపల్లికి చెందిన దేవవరపు కొండలరావు రూ.16.11లక్షలకు హెచ్చు పాట పాడినట్లు తెలిపారు. గత ఏడాది కంటే రూ. 28 వేల ఆదాయం ఎక్కువ ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు. హ్యాండ్ పంప్ మెటీరియల్ వేలం పాట నిర్వహించగా వెలగా రమేష్ రూ.2.07లక్షలకు దక్కించుకున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు నానాజీ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సత్వరమే పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ వివి.రమణ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ ఎటువంటి అలసత్వానికి ఆస్కారం లేకుండా అర్జీలను సత్వరం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పరిష్కార చర్యలపై దరఖాస్తుదారులకు తెలియజేయాలని సూచించారు. .కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండు వేసవిలో మంచు దుప్పటి

నష్టం వాటిల్లుతుందని జీడిమామిడి రైతుల ఆందోళన

వేకువజామున దట్టంగా కురుస్తున్న పొగమంచు

ప్రజాశక్తి - కోటవురట్ల : మండువేసవి కాలంలో ఉదయం పూట దట్టంగా కురుస్తున్న పొగమంచుతో అన్ని వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు, సోమవారం కోటవురట్ల ప్రాంతంలో దట్టంగా కురిసిన మంచు, వేసవిని కాకుండా శీతాకాలాన్ని తలపించేదిగా ఉందని అంటున్నారు. దీంతో పూత పిందె దశలో ఉన్న జీడీ మామిడి తోటలకు ఈ పొగమంచుతో నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మంచుదెబ్బకు పూత, పిందె నిలబడదని, మాడిపోతుందని వాపోతున్నారు. మరోవైపు కురుస్తున్న మంచు కారణంగా ప్రయాణికులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

తిరుమల శ్రీవారి సన్నిధిలో స్పీకర్ అయ్యన్న

భోజనం చేస్తున్న అయ్యన్నదంపతులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామివారిని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. అనంతరం తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తుల మధ్య అన్నప్రసాద స్వీకరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి కృపా కటాక్షాలు సర్వ జనులకు లభించాలని ఆకాంక్షించారు. దేవస్థానం వృద్ధి, భక్తుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రంగనాయక మండపంలో స్పీకర్ దంపతులను వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు.

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : గొలుగొండ మండలంలోని ఏఎల్.పురం పంచాయతీలో రూ.9లక్షలతో చేపట్టబోయే మూడు సీసీ రోడ్ల నిర్మాణ పనులను సోమవారం కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీర సూర్యచంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సారధ్యంలో నర్సీపట్నం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ఈ ఎనిమిది నెలల కాలంలో రూ.78 కోట్లు వెచ్చించారన్నారు. ఆ నిధులతో ఇప్పటి అన్ని గ్రామాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు వంటివి నిర్మించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, ఏఎల్.పురం సర్పంచ్ లోచల సుజాత, ఎంపిటిసి రుత్తల రామకృష్ణ, గొలుగొండ మండల జనసేన పార్టీ అధ్యక్షులు గండెం దొరబాబు, మండల ప్రధాన కార్యదర్శి సలాదుల ప్రసాద్‌బాబు, బిసిసెల్ అధ్యక్షులు ముక్కలి రమేష్, పారిశ్రామి కవేత్త వెలగా కృష్ణారావు, బొడ్డు జమీలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : గొలుగొండ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిపి కరుణానిధి ఆధ్వర్యంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. స్టాల్‌ను ఎంపిడిఒ మేరీ రోజ్ సందర్శించారు ఎపిఎం కరుణానిధి మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేస్తామన్నారు.మండల వ్యవసాయ అధికారి సుధారాణి, ఎస్ఐ రామారావు పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలని, ప్రైవేటుపరం చేసేందుకు పిలిచిన రీ టెండర్‌ను రద్దు చేయాలని యునైటెడ్ పోర్ట్స్ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు వివిఎస్ పద్మనాభరాజు డిమాండ్ చేశారు. సోమవారం జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్, విడిఎల్‌బి, డాక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హాస్పిటల్ ప్రైవేటీకరణలో భాగంగా పోర్టు యాజమాన్యం పిపిపి పద్ధతిలో రీ టెండర్‌ను ఆహ్వానించడం, ఏప్రిల్ 19 వరకు గడువు ఇవ్వడం, ఏప్రిల్ 21న టెండర్లు ఓపెన్ చేయడం ద్వారా పోర్టు కార్మికుల ఆరోగ్య భద్రతను అపహాస్యం చేస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. హాస్పిటల్ ప్రైవేటీకరణతో పోర్టు ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు తీవ్ర నష్టం జరుగునుందని తెలిపారు. పోర్టు యాజమాన్యమే సొంత నిధులతో హాస్పిటల్‌ను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు బి.జగన్, కె.సత్యనారాయణ మాట్లాడుతూ పోర్టు హాస్పటల్ ప్రైవేటీకరణకు సంబంధించిన రీ టెండర్‌ను రద్దు చేయాలంటూ

నిరసనలు, ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

తలపెట్టిన ఉద్యమ కార్యాచరణను వివరించారు. అందులో భాగంగా ఈ నెల 18 నుంచి పోర్టు ప్రాంగణంలో గేటు మీటింగ్‌లు, 24 నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు, ఏప్రిల్ 1 నుంచి ఉద్యోగుల నివాస ప్రాంతాల్లో నిరసనలు, ఏప్రిల్ 9న చలో ఎఓబి కార్యక్రమం ఉంటాయని తెలిపారు. ఆయా కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వి.రామలింగేశ్వరరావు, జక్కాన సత్యనారాయణ, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు. అనంతరం ఉద్యమ కార్యాచరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఉపాధి పని కల్పనలోనూ రాజకీయమేనా!

కూటమి పార్టీలకు చెందిన గ్రూపులకే పని

నీలుకుంటలో సర్పంచ్ ఆధ్వర్యంలో కూలీల నిరసన

ప్రజాశక్తి - కోటవురట్ల : మండలంలో నీలుకుంట గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి కూలీలతో కూటమి ప్రభుత్వం నేతలు రాజకీయం చేస్తుందని సర్పంచ్ కే వరహాలబాబు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, సోమవారం గ్రామంలో 18 గ్రూపులకు గాను, కేవలం 4 గ్రూపుల ఉపాధి కల్పించి మిగతా 14 గ్రూపులకు ఉపాధి కల్పించకపోవడంతో గ్రూపు సభ్యులు శనివారం ఉపాధి కూలీలు నిరసనకు దిగారు, విషయం తెలుసుకున్న సర్పంచ్ వివరాలు అడిగి తెలుసుకోవడంతో కేవలం కూటమి కూలీలకు మాత్రమే ఉపాధి కల్పించి, తమకు పని లేదంటున్నారని ' వివరించారు, దీనిపై ఎంపిడిఒ, ఎపిఒల దృష్టికి తీసుకెళ్లినా స్పష్టమైన సమాధానం ఇవ్వలేదని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు, కాగా ఇక్కడ నియమించిన ఇన్‌ఛార్జి విఆర్‌పి విధులు

నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధికూలీలు

నిర్వహణలో నిర్లక్ష్యం చూపడం వల్లే తమకు ఉపాధి పని లేకుండా పోయిందని కూలీలు ఆరోపిస్తున్నారు, ఇప్పటికైనా జాబ్‌కార్డులున్న తమకు ఉపాధి పని కల్పించకుంటే మండల కేంద్రంలో నిరసన చేపట్టక తప్పదని ఉపాధి కూలీలు అంటున్నారు.

'ఉక్కు'పై కేంద్రం కుట్రలను తిప్పికొడతాం

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని సిఐటియు నాయకులు యు.వెంకటేశ్వర్లు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1495వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) కార్యకర్తలు, ఉక్కు ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కార్మికుల పోరాటానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో మద్దతు తెలపాలన్నారు. కర్మాగారాన్ని కాపాడేందుకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కోరారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేలా, సెయిల్‌లో విలీనం చేసేలా కృషి చేయాలన్నారు. రానున్న కాలంలో ఉక్కు పరిరక్షణ ఉద్యమం ప్రజా ఉద్యమంగా రూపుదాల్చనుందని తెలిపారు. త్యాగాలతో ఏర్పడ్డ కర్మాగారాన్ని త్యాగాలతోనే పరిరక్షించుకుంటామని స్పష్టం చేశారు.

నెలాఖరులోగా ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: ఇకెవైసి నమోదు కాని రేషన్ లబ్ధిదారులు ఈనెల 31వ తేదీ లోగా నమోదు చేసుకోవాలని తహసిల్దార్ నరసింహమూర్తి తెలిపారు. రేషన్ లబ్ధిదారులకు ఇకెవైసి నమోదు ప్రక్రియ తప్పనిసరి చేసిందని, లేదంటే ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సబ్సిడీపై అందించే రేషన్ సరుకులను నష్టపోతారన్నారు. ఆరేళ్ల నుంచి 60ఏళ్లలోపున్న వారంతా రేషన్ డిపో డీలర్ వద్ద లేక ఆధార్ కేంద్రాల వద్ద ఇకెవైసి నమోదు చేసుకోవాలన్నారు. ఇకెవైసి నమోదు కాని లబ్ధిదారులు జాబితా రేషన్ డిపో, స్థానిక విఆర్ఓల వద్ద ఉందని, లబ్ధిదారులు వెంటనే జాబితాను పరిశీలించుకుని, ఇకెవైసి నమోదు చేసుకోవాలన్నారు

వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి -నక్కపల్లి : ఉపమాక వెంకన్న వార్షిక తిరు కల్యాణోత్సవాల సందర్భంగా భక్తులు హుండీల్లో వేసిన కానుకలను లెక్కించారు. హుండీల ద్వారా రూ.29,57,600 ఆదాయం సమకూరినట్లు టిటిడి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్‌ఆఫీసర్ ఎం జగన్‌మోహన్ ఆచార్యులు తెలిపారు. గడచిన 28 రోజులకు హుండీల్లోని కానుకలను లెక్కించినట్లు తెలిపారు. సోమవారం ఉదయం ఆలయంలో శ్రీవారి సేవకుల ద్వారా టిటిడి విజిలెన్స్ సిబ్బంది సమక్షంలో హుండీలు తెరిచి లెక్కింపు చేపట్టారు. ఉత్సవాల సందర్భంగాతిరుమల లడ్డూ ప్రసాదములు అమ్మకం ద్వారా రూ.ఐదు లక్షల సమకూరినట్లు ఇఒ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటరమణ, టెంపుల్ ఇన్స్పెక్టర్ కూర్మేశ్వరరావు, దేవస్థానం ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు,దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

రొయ్యల పరిశ్రమ బస్సు బోల్తా

32 మంది మహిళా కార్మికులకు గాయాలు : ఆసుపత్రికి తరలింపు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ప్రజాశక్తి -నక్కపల్లి : ఎస్ రాయవరం మండలం, చిన గుమ్ములూరు వద్ద సోమవారం తెల్లవారుజామున బస్సు బోల్తా పడిన ఘటనలో 32 మంది మహిళా కార్మికులు గాయపడ్డారు. వారిలో 13 మందికి తీవ్రగాయాలు కావడంతో అనకాపల్లి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వివరాలివి.

ఎస్ రాయవరం మండలం, ధర్మవరం అగ్రహారంలోని కోస్టల్ కార్పొరేషన్ సీఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (రొయ్యల పరిశ్రమ) కంపెనీ బస్సు కోటవురట్ల, లింగపురం, పందురు, చిన గుమ్ములూరు గ్రామాలకు చెందిన 32మంది మహిళా కార్మికులతో కంపెనీని వస్తుండగా, చిన గుమ్ములూరు వద్ద బస్ అదుపుతప్పి పంట పొలాల్లో బోల్తా పడింది. బస్సులోని 32 మందికి గాయాలుకాగా, వారిని వెంటనే అంబులెన్సులో నక్కపల్లి 50 పడకల ప్రభుత్వాసుపత్రి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం 13 మందిని అనకపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ నక్కపల్లి ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు.ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్షతగాత్రులను ఫోనులో పరామర్శించిన హోంమంత్రి అనిత

చినగుమ్ములూరు వద్ద రొయ్యల పరిశ్రమ బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్ర హోంశాఖమంత్రి వంగలపూడి అనిత ఆరా తీశారు. ఫోనులో క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.హాస్పటల్ లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను తక్షణమే పరామర్శించి,వారి యోగక్షేమాలు చూడాలని స్థానిక నేతలకు సూచించారు.

బాధితులకు సిపిఎం నేతల పరామర్శ

నక్కపల్లి : బస్సు ప్రమాదంలో గాయాలు పాలై నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోస్టల్ కార్పొరేషన్ కంపెనీ మహిళా కార్మికులను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, మండల కార్యదర్శి ఎం.రాజేష్ పరామర్శించారు. ప్రమాద ఘటనపై బాధితులతో మాట్లాడి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ కోటవురట్ల మండలం లింగాపురం, కైలాసపట్నం, ములగలలోవ, పందూరు, గొట్టివాడ, ఎస్.రాయవరం మండలం చిన్న గుమ్ములూరు గ్రామాల నుండి సోమవారం తెల్లవారుజామున ఎస్.రాయవరం మండలం, ధర్మవరం అగ్రహారం గ్రామంలో గల కోస్టల్ కార్పొరేషన్ సీ ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి మహిళా కార్మికులు విధులకు వెళ్తుండగా ఎస్.రాయవరం మండలం, నీలాద్రిపురం పెట్రోల్ బంక్ వద్ద కంపెనీ బస్సు ప్రమాదవశాత్తూ పొలాల్లో బోల్తాపడింది. ప్రమాదంలో చింతల సాయిలక్ష్మి అనే కార్మికురాలికి చేయి విరిగిపోగా,

బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం నేతలు

ఎస్.లక్ష్మికి తలకు బలమైన గాయమైంది, అనేక మందికి చేతులకు, కాళ్ళు కు గాయాలు అయినట్లు తెలిపారు. ప్రమాదానికి కంపెనీ యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని, వైద్యం పొందినంత కాలం వారికి జీతం ఇవ్వాలని, బలమైన గాయాలైన వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.